# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :126 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 19-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## అత్యుత్తమ వైద్యసేవా సంస్థగా స్విమ్స్

తిరుపతి, తిరుపతి లోని స్విమ్స్ ఆసుపత్రిని అత్యుత్తమ వైద్యసేవా సంస్థగా తీర్చిదిద్దు తామని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్విమ్స్‌ను ఎన్టీఆర్ ప్రారంభించారని బీఆర్ నాయుడు గుర్తుచేశారు. స్విమ్స్‌కు అవసరమైన సదుపాలను తితిదే కల్పిస్తుందని.. ఏటా రూ. 146 కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. స్విమ్స్‌లోని పద్మావతి వైద్యకళాశాలకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వైద్యపరికరాలను అందజేసింది. రూ. 22 కోట్ల విలువైన అత్యాధునిక ఎంఆర్ఐ స్కానర్, 4డీ సీటీ– సిమ్యులేటర్ సిస్టంను విరాళంగా ఇచ్చింది. వీటిని గురువారం సాయంత్రం ఛైర్మన్ బీఆర్ నాయుడు, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, ఐవోసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ వి. సతీశ్‌కుమార్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడారు. ఐవోసీఎల్ విరాళంగా అందించిన అధునాతన వైద్య పరికరాలతో ఏడాదికి 2.5లక్షల మందికి తక్కువ ఖర్చుతో ఎంఆర్ఐ, రేడియో థెరపీ సేవలను అందించవచ్చున్నారు.

## ఒక్క కేసులోనూ ఆధారం చూపడం లేదు



ఖమ్మం,జూలై18: తనపై టన్నుల కొద్దీ కేసులు పెట్టారని.. చివరికి గుండు సూదంత ఆధారం చూపలేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఖమ్మంలో ఏర్పాటు– చేసిన మీడియా సమావేశంలో ఆయన పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. ధైర్యం ఉంటే ఏం ఆధారాలు ఉన్నాయో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. దుబాయ్‌లో ఎవరో చనిపోతే నాకేం సంబంధం. దురలవాట్లకు ప్రజలు దూరంగా ఉండాలి. నేను జీవితంలో ఏనాడూ సిగరెట్ కూడా తాగలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నాపై ఎన్నో ఆరోపణలు చేశారు. నేను ఏం చేసినా.. బాజాప్తే చేస్తా. నేను ఏపీ మంత్రి లోకేశ్‌ను కలవలేదు.. ఒక వేళ కలిసినా తప్పేంటి? నారా లోకేశ్ నాకు మంచి మిత్రుడు.. ఆయనతో సత్సంబంధాలు ఉన్నాయి. ఆయన పక్క రాష్ట్రం మంత్రి.. నాకు తమ్ముడి లాంటి వారు. డైవర్షన్ పాలిటిక్స్ తప్ప.. రేవంత్‌రెడ్డి 20 నెలల్లో చేసింది శూన్యం. నా విషయంలో ఓసారి డ్రగ్స్ అంటారు, ఓ సారి కార్ రేసింగ్ అంటున్నారు. రేవంత్‌రెడ్డి వల్ల యూట్యూబర్లకు మినహా ఎవరికీ లాభం చేకూరలేదు. గాసిప్‌ల మాయలో పడి.. ఆరు గ్యారంటీలను మర్చిపోదామా? బనకచర్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు. దిల్లీ భేటీ అజెండాలో బనకచర్ల అంశమే లేదన్నారు. దిల్లీ కేంద్రంగా రాష్ట్రానికి మరోసారి ద్రోహం చేశారు. చంద్రబాబుతో చీకటి ఒప్పందం చేసుకున్నారు. 420 హామీల విషయంలో కాంగ్రెస్‌తో ఫుట్‌బాల్ ఆడటం ఖాయం అని కేటీఆర్ అన్నారు. శక్రవారం కెటిఆర్ ఖమ్మం జిల్లాలో పర్యటించారు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పువ్వాడ అజయ్ కుమార్ కార్యకర్తలతో ఏర్పాటు– చేసిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. తన ముఖ్యమంత్రి సీటుకు ఎసరు పెడుతున్నారనే భయంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోన్లు ట్యాప్ చేయించడం లేదా? అని ప్రశ్నించారు. దమ్ముంటే రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఆధారాలతో సహా అన్నీ బయటపెడతా అని అన్నారు. రేవంత్ ప్రెస్‌మీట్‌కు యువత దూరంగా ఉండాలను సూచించారు. రేవంత్ పిరికి సన్నాసాని.. చర్చకు రమ్మంటే పారిపోతున్నాడని ఫైరయ్యారు. రేవంత్‌రెడ్డి మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని... చిట్‌చాట్‌లో చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్‌లా తాను దొంగను కాదని.. సంచులు మోయలేదని అన్నారు. బనకచర్లపై చంద్రబాబును కలవబోనని చెప్పి.. ఢిల్లీలో కలిసి దొరికారని అన్నారు. గోదావరి జలాలను చంద్రబాబుకు అప్పజెప్పి తెలంగాణకు ద్రోహం చేశారని మండిపడ్డారు. ఢిల్లీలో దొరికిన దొంగ అ–టెన్షన్ డైవర్షన్ కోసమే పిచ్చివాగుడు వాగుతున్నదని సీఎంపై నిప్పులు చెరిగారు. రేవంత్‌రెడ్డి తప్పు చేస్తే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

## ఏ రోజైనా అభివృద్ధి గురించి ఆలోచించారా?



పాట్నా:ఆపరేషన్ సిందూర్ సంకల్పాన్ని బీహార్ భూమి నుంచే తీసుకున్నట్లు ప్రధాని మోడీ అన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మోతిహారిలో పర్యటించారు. రూ. 7,000 కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ ప్రసంగిస్తూ కాంగ్రెస్, ఆర్జేడీపై నిప్పులు చెరిగారు. బీహార్‌లో పేద ప్రజల అభ్యున్నతి గురించి ఆర్జేడీ, కాంగ్రెస్ ఎప్పుడైనా ఆలోచించాయా? అని ప్రశ్నించారు. ఆర్జేడీ–కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. తూర్పు భారతదేశంలో సమగ్ర అభివృద్ధికి 'విక్షిత్ బీహార్' ఎంతైనా అవసరం ఉందని చెప్పారు. యూపీఏ, ఆర్జేడీ ప్రభుత్వాల కాలంలో కేవలం రూ. 2లక్షల కోట్ల గ్రాంట్లు మాత్రమే మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏను గెలిపిస్తే.. సరికొత్త బీహార్‌ను చూపిస్తామని హామీ ఇచ్చారు. బీహార్‌లో 3.5 కోట్లకు పైగా మహిళలు బ్యాంకు ఖాతాలు పొందారరని.. గత 1.5 సంవత్సర కాలంలో బీహార్‌లో 24,000 స్వయం సహాయక బృందాలకు సహాయం అందించినట్లు చెప్పారు. 24,000 స్వయం సహాయక సంఘాలకు రూ. 1,000 కోట్లతో సహాయం అందించినట్లు తెలిపారు. నార్వే మొత్తం జనాభా కంటే బీహార్‌కు ఎక్కువ ఇళ్లు ఇచ్చినట్లు గుర్తుచేశారు. ప్రధాని ఆవాస్ యోజన కింద నార్వే, న్యూజిలాండ్, సింగపూర్‌ల మొత్తం జనాభా కంటే బీహార్‌కు ఎక్కువ ఇళ్లు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, డిప్యూటీ సీఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా పాల్గొన్నారు. ప్రధాని మోడీ నాలుగు కొత్త అమృత్ భారత్ రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు.

## రేవంత్ పొట్టివాడైనా గట్టివాడే




న్యూఢిల్లీ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నుకోబడిన నేత అని నామినేట్ చేయబడిన వ్యక్తి కాదన్నారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ. తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయలేదని అంటూ పొట్టివాడు గట్టి వాడు అని ప్రశంసించారు.. ఢిల్లీ లో నేడు మీడియాతో మాట్లాడుతూ%% రేవంత్‌ను విమర్శిస్తూ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఏపీ, తెలంగాణ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి నీళ్లను అడ్డుకోవద్దన్నారు. రెండు రాష్ట్రాలు నీటి పంపిణీ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించుకోవాలని సూచనలు చేశారు. నీటి ప్రాజెక్టుల గురించి సీపీఐ ఎప్పుడూ సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని సీపీఐ స్వాగతిస్తుందన్నారు. నదుల్లో రెండు రాష్ట్రాల నీటి వాటాలు తేలాకనే నీటి ప్రాజెక్టులపై ముందుకు వెళ్ళాలని సూచించారు. రాయలసీమకు నీళ్ళు అవసరం అని తెలిపారు. ఏపీ, తెలంగాణలో నీటి అంశాలను రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. నీళ్ళను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయం చేయడమే అంటూ వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ గా మారిన వెంటనే సెంటిమెంట్ గోవింద

టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన తరువాత సెంటిమెంట్ ఎగిరిపోయిందని.. ఇప్పుడు సెంటిమెంట్లు లేవంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రతి అంశంపై సెంటిమెంట్లతో రెచ్చగొడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం అవినీతిమయం అయిందని ఆరోపించారు. బనకచర్ల గురించి చంద్రబాబు అతిగా మాట్లాడారన్నారు నారాయణ. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బనకచర్లను తెర మీదికి తెచ్చారన్నారు.

రేవంత్ చర్చించకపోవడం చంద్రబాబు తప్పే..

బనకచర్ల గురించి చంద్రబాబు మొదట మాట్లాడాల్సింది తెలంగాణ ముఖ్యమంత్రితో అని.. అలా చేయకపోవడం వల్ల విమర్శలు వచ్చి తెలంగాణ సీఎం ఆ ప్రాజెక్టను వ్యతిరేకించారని చెప్పుకొచ్చారు. బనకచర్ల ప్రస్తుతం ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదన్నారు. మొదట పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్నారు. బనకచర్ల 80వేల కోట్ల ప్రాజెక్టు కాదని.. 2 లక్షల కోట్లు అవుతుందని తెలిపారు. ముందుగా ఇరు రాష్ట్రాలు వివాద రహితంగా ప్రాజెక్టులు కట్టుకోవాలని నారాయణ సూచించారు.

## జడ్జిల కమిటీ నివేదికను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు జస్టిస్ యశ్వంత్ వర్మ



న్యూఢిల్లీ: ఢిల్లీలోని తన ఇంట్లో భారీగా నోట్ల కట్టలను గుర్తించిన కేసులో .. అలహాబాద్ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ ఇవాళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇన్‌హౌజ్ కమిటీ ఇచ్చిన నివేదికను ఆయన సవాల్ చేశారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా పనిచేస్తున్న సమయంలో మార్చి 14వ తేదీన అతని ఇంటిలో భారీగా నోట్ల కట్టలు బయటపడిన వచ్చిన విషయం తెలిసిందే. పంజాబ్, హర్యా హైకోర్టు చీఫ్ జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్నాటక హైకోర్టు జస్టిస్ అను శివరామన్‌తో కూడిన కమిటీ ఓ నివేదికను మే 4వ తేదీన రిలీజ్ చేసింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి స్టోర్‌రూమ్‌లో క్యాష్ ఉన్నట్లు ఆ కమిటీ పేర్కొన్నది. ఆ రిపోర్టు ఆధారంగా వర్మను తొలగించాలని అప్పటి సీజేఐ సంజీవ్ ఖన్నా మే 8వ తేదీన రాష్ట్రపతి, ప్రధానిని కోరారు. తనను తొలగించాలని జస్టిస్ ఖన్నా చేసిన ప్రతిపాదన రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ వర్మ తన పిటీషన్‌లో తెలిపారు. జడ్జీలపై జరిగిన ఇన్‌హౌజ్ దర్యాప్తు తీరును జస్టిస్ వర్మ ప్రశ్నించారు. సమాంతర రాజ్యాంగ వ్యవస్థను క్రియేట్ చేసి విచారణ సాగించినట్లు జస్టిస్ వర్మ ఆరోపించారు. 1968 జడ్జీల రక్షణ చట్టం ప్రకారం ఇన్‌హౌజ్ దర్యాప్తు జరగలేదని ఆయన పేర్కొన్నారు. అధికారిక ఫిర్యాదు లేకుండానే విచారణ చేపట్టడం అక్రమమని ఆయన అన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండానే తనపై ఆరోపణలు చేసినట్లు చెప్పారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో మార్చి 14వ తేదీ రాత్రి 11.35 నిమిషాలకు అగ్నిప్రమాదం జరిగింది. అప్పుడు ఆయన ఢిల్లీ హైకోర్టు జడ్జీగా ఉన్నారు. ఆయన స్టోర్‌రూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదాన్ని ఆర్పేందుకు ఫైరింజన్లు అక్కడకు చేరుకున్నాయి. 15 నిమిషాల్లోనే ఆ మంటల్ని ఆర్పేశారు. అయితే ఆ స్టోర్‌రూమ్ నుంచి గుర్తు తెలియని నగదును రికవరీ చేశారు. మంటల్లో కాలిపోతున్న నోట్ల కట్టలకు చెందిన ఓ వీడియో కూడా బయటకు వచ్చింది. దీంతో జస్టిస్ యశ్వంత్ వర్మ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి . ఆరోపణల నేపథ్యంలో జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు.

## వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం..

హైదరాబాద్, జులై 18: ఆ నాటి ప్రధాని పీవీ నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తుచేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని తెలిపారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్యంయూ)కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని.. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ (శనివారం) రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామని.. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి అన్నారు.

వరంగల్‌లో ఆదునిక కోచ్‌లు..

రాదు అనుకున్న పరిశ్రమను మోదీ తెలంగాణకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని కేసీఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు తెలిపారు. కేసీఆర్ రాళ్లు వేయడం, విమర్శించడం తప్ప.. భూమి సేకరించి ఇవ్వలేదని విమర్శించారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రెండు వందల కోట్లతో ప్రారంభమైందని.. మరో రెండు వందల కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉందన్నారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశం దొరుకుతుందన్నారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని.. రేపు రాజస్థాన్‌కు ట్రైన్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటీఎస్ రెండో పేజ్ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదని అన్నారు. యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్‌ను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ జనవరిలో భక్తులకు అంకితం చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా వచ్చే సంవత్సరం ప్రజలకు అంకితం చేస్తామని ప్రకటించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. తెలంగాణకు మోదీ ఏమి చేశారన్న వాళ్ల వినాలి.. కళ్ళతో చూడాలన్నారు. ప్రధాని శంకుస్థాపనకు వస్తే రాకుండా ఆ నాటి ముఖ్యమంత్రి ఫాం హౌస్‌లో పడుకున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సదుపాయం కల్పి స్తున్నామన్నారు..



జడ్జ్‌మెంట్ కోసం పిలవలేదు

కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే జోక్యం చేసుకుంది అంటున్నారని.. జోక్యం చేసుకోకపోతే.. ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారని కేంద్రమంత్రి అన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను కూర్చోపెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. జడ్జ్‌మెంట్ ఇవ్వడానికి ఇద్దరు ముఖ్యమంత్రులను పిలవలేదని స్పష్టం చేశారు. బనకచర్ల సమస్య పరిష్కారం కోసం పిలిచామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక పాలసీ.. అధికారంలో లేనప్పుడు మరొక్క పాలసీ అవలంభిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పాత్రలు పోషించారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రానికి జోక్యం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని.. ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశాన్ని బీఆర్ఎస్ తప్పు పట్టడం ఏంటి అంటూ ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి అనుకూలంగా.. మరొక రాష్ట్రానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వరన్నారు. కృష్ణా, గోదావరి జలాలపైన ఇద్దరు ముఖ్యమంత్రులు వేరు వేరు ఎజెండాలతో వచ్చారని చెప్పారు. గోదావరి జలాల వినియోగంపైన రేవంత్ రెడ్డి ఏదైనా కార్యాచరణ రూపొందించారా అని ప్రశ్నించారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలకు న్యాయం చేయాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. యూరియా కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిదన్నారు. బ్రిటీష్ కాలంలో ఉన్న రిజర్వేషన్లను ముస్లిం రిజర్వేషన్లు ఎట్లా అవుతాయని అడిగారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ ముస్లింల పేరు మీద పది శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్నారు. పది శాతం పోతే బీసీలకు దక్కేది 32 శాతం మాత్రమే అని అన్నారు. దీనివల్ల బీసీలకు మేలు జరుగుతుందా.. అన్యాయం జరుగుతుందా ఆలోచించాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లు పక్కన పెట్టి బీసీలకే ఇవ్వాలనదే బీజేపీ విధానమని స్పష్టం చేశామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## దక్షిణాది రాష్ట్రాలకు భారీ వర్ష సూచన.. తెలంగాణకు ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్,దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర వాతావరణ శాఖ భారీ వర్ష సూచన చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించింది. దీంతో తెలంగాణకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో వర్షపాతం మరింత పెరిగే అవకాశం ఉందని ఐఎండీ హైదరాబాద్ చీఫ్ కె నాగరత్న తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 33 జిల్లాల్లో కొన్ని ప్రదేశాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు మరియు బలమైన గాలులు కూడా సంభవించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. జూలై 22 వరకు కేరళ, తమిళనాడు, కర్ణాటకలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వార్నింగ్ ఇచ్చింది. రాబోయే రోజుల్లో రాయలసీమ, లక్షద్వీప్‌లలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తా..



జనగామ: దేవాదుల నుంచి నీటిని విడుదల చేయడంలో రేవంత్ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. నాలుగు రోజుల్లో దేవాదుల నీటిని విడుదల చేయాలని.. లేదంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిముందు ధర్నా చేస్తానని హెచ్చరించారు. దేవాదుల నుంచి నీటిని విడుదల చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పాలకుర్తి మండలం మాదాపురం దంతాలతండా నుంచి పాదయాత్రని ఇవాళ(శుక్రవారం) ప్రారంభించారు ఎర్రబెల్లి దయాకర్‌రావు. పాదయాత్రలో రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి ఎర్రబెల్లి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ రైతుల పక్షానా పోరాడుతోందని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకి మేలు చేసిందని చెప్పుకొచ్చారు ఎర్రబెల్లి దయాకర్‌రావు. కాగా.. పాలకుర్తిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. దేవాదుల నుంచి నీటి విడుదలపై అధికార, ప్రతిపక్షాల మధ్య వాటర్ వార్ కొనసాగుతోంది. దేవాదుల నీటిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల మధ్య రాజకీయ రగడ రాజుకుంది. దేవాదుల నీటి విడుదలపై ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు మధ్య దేవాదుల నీటి పంచాయతీ రగులుతోంది. దేవాదుల నీటి విడుదలపై నిన్న(గురువారం) అధికారులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమావేశం అయ్యారు. నీటిని విడుదల చేయాలని అధికారులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశించారు. ఈ క్రమంలోనే ఎర్రబెల్లి దయాకర్‌రావు పాదయాత్ర చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సంపాదకీయం

శనివారం 19-07-2025

# యూపీఐ విప్లవం.. సామాన్యులే సారథులు

మన దేశంలో డిజిటల్ లావాదేవీలు పోనుపోను జోరందుకుంటున్నాయి. ముఖ్యంగా కూరగాయలు విక్రయించే వ్యక్తి నుంచి పెద్ద షాపుల వరకు యూపీఐ వినియోగం విస్తృతమైంది. చాలా దేశాలు ఈ విధానాన్ని అందిపుచ్చుకోవడానికి ఆసక్తి చూపుతుండటం విశేషం. దేశీయంగా ఇమీడియట్ పేమెంట్ సర్వీస్(ఐఎంపీఎస్), రూపే, ఇ-రూపీ వంటి డిజిటల్ చెల్లింపుల వేదికలను భారత జాతీయ చెల్లింపుల సంస్థ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-ఎన్‌పీసీఐ) నిర్వహిస్తోంది. ఇది 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.1,552 కోట్ల లాభాలు ఆర్జించింది. ఈ మొత్తం అంతకుముందు సంవత్సరంకన్నా 42శాతం అధికం. నేడు ఎన్‌పీసీఐ ద్వారా 21,300 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరుగుతు న్నాయి. ఎన్‌పీసీఐ 2016 ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన యూపీఐ ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయింది. రోజులో 24 గంటలూ రియల్ టైమ్ యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. వినూత్న డిజిటల్ చెల్లింపుల పద్ధతి అయిన యూపీఐ ఇతర దేశాలకూ అనుసరణీయమవుతోంది. 2025 మే 31 నాటికి ఎన్‌పీసీఐలో 65 ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, సహకార బ్యాంకులు, విదేశీ సంస్థాగత మదుపరి సంస్థలు భాగస్వాములుగా ఉ న్నాయి. 673 బ్యాంకులు యూపీఐ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. 80 యూపీఐ యాప్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. నేడు ఫోన్ పే(47.23 శాతం లావాదేవీలు), గూగుల్ పే(36.66శాతం), పేటీఎం (6.95 శాతం)లు మార్కెట్లో ప్రధాన పాత్రధారులుగా నిలుస్తున్నాయి.

సులువుగా బ్యాంకింగ్ సేవలు

ప్రపంచంలో రియల్ టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 49శాతం ఒక్క భారతదేశంలోనే జరుగుతున్నాయి. యూపీఐ వినియోగంలో హైదరాబాద్, కోల్‌కతాలు అగ్రస్థానంలో ఉన్నాయి. వీసా కార్డుల కన్నా యూపీఐ వినియోగం నాలుగు రెట్లు వేగంగా పెరుగుతోంది. ఏటా నలభై శాతం వృద్ధిరేటు నెలకొంటోంది. యూపీఐ మాస్టర్ కార్డును కూడా మించిపోతోంది. రోజుకు వంద కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగేలా చూడాలని భారత ప్రభుత్వం లక్షిస్తోంది. యూపీఐ లావాదేవీల విలువ, పరిమాణాలు వీసా, మాస్టర్ కార్డులకన్నా ఎక్కువ. ఈ ఏడాది మే నెలలో 1868 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. వాటి విలువ రూ.25 లక్షల కోట్లు. 2025 ఆర్థిక సంవత్సరంలో నిమిషానికి 3.50 లక్షల యూపీఐ లావాదేవీల చొప్పున జరిగాయి. యూపీఐ లావాదేవీలు ఒక శాతం అధికమైతే జీడీపీ 0.03శాతం పెరుగుతుందని అంచనా.

నేడు ఇండియాలో బ్యాంకింగ్, పెట్టుబడులు, చెల్లింపుల వంటి ఆర్థిక కార్యకలాపాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ఎక్కువైంది. ఈ తరహా సేవలు అందించే కంపెనీలను ఫిన్‌టెక్ సంస్థలంటారు. 2032కల్లా భారతీయ ఫిన్‌టెక్ రంగ విలువ 99,045 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇంటర్నెట్ వంటి డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, యువతరంలో సాంకేతికత వినియోగం పెరగడం వల్ల 2024 నుంచి 2032 వరకు ఫిన్‌టెక్ రంగం ఏటా 30.26శాతం చక్రీయ వృద్ధి రేటు చొప్పున నమోదుచేయనుంది. నేడు ప్రభుత్వ ప్రోత్సాహంతో ఫిన్‌టెక్ స్టార్టప్‌లకు బ్యాంకులకూ మధ్య సంబంధాలు విస్తరిస్తున్నాయి. ఇప్పుడు కొని, తరవాత చెల్లించే పద్ధతి వ్యాపిస్తోంది. కృత్రిమ మేధ (ఏఐ) మూలంగా స్మార్ట్ చాట్‌బాట్లు, రోబో సలహాదారులు పెరుగుతున్నారు. ఏఐ, మెషీన్ లెర్నింగ్, బ్లాక్ చెయిన్ సాంకేతికతలూ విస్తరిస్తున్నాయి. సౌండ్‌బాక్స్, క్యూఆర్ కోడ్, యూపీఐ సర్కిల్, యూపీఐ లైట్, మిస్డ్‌కాల్ పేమెంట్ వంటి పద్ధతులు విరివిగా అందుబాటులోకి వచ్చాయి. 2024నాటికి భారతదేశంలో పదివేలకుపైగా ఫిన్‌టెక్ సంస్థలున్నాయి. వాటిలో 26 సంస్థలు తలా వంద కోట్ల డాలర్ల నికర విలువను సాధించి యూనికార్న్‌లుగా ఎదిగాయి. ఒక సంస్థ వెయ్యి కోట్ల డాలర్ల డెకా కార్న్‌గా మారింది. ఫోన్‌పేకు నేడు 61 కోట్లమంది వినియోగదారులున్నారు. రేజర్ పే, పైన్‌ల్యాబ్స్ వంటి ఫిన్‌టెక్ సంస్థలు ఇతర దేశాలకూ వ్యాపించాయి.

ఆధార్, డిజిటల్ ఇండియా, జన్‌ధన్ యోజన వంటి పథకాలతో భారత ప్రభుత్వం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. యూపీఐ మీద ప్రజల్లో నమ్మకం పెరిగేలా ప్రభుత్వం వెన్నుదన్ను ఇచ్చింది. రిజర్వు బ్యాంకు ఎన్‌పీసీఐని, ఇన్నొవేషన్ హబ్‌నూ ప్రారంభించి డిజిటల్ లావాదేవీలకు విస్తృతి కల్పించింది. అందుకే యూపీఐ, ఆధార్‌లు డిజిటల్ మౌలిక వసతులకు అత్యున్నత ప్రతీకలని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ కీర్తించారు. ఈ రెండింటి వల్ల దేశవ్యాప్తంగా అశేష ప్రజానీకానికి సులువుగా బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయని ప్రపంచ బ్యాంకు కూడా ప్రస్తుతించింది. రిలయన్స్ జియో వంటి సంస్థలు చవకగా డేటాను అందించడం, డిజిటల్ ఐడీలు, బ్యాంకింగ్ సేవలు విస్తరించడం వల్ల యూపీఐ సామాన్య ప్రజల్లోకీ చొచ్చుకుపోయిందని ఐఎంఎఫ్ పేర్కొంది. ఫిన్‌టెక్ రంగంలో అమెరికా, బ్రిటన్, ఇండియాలు అగ్రగాములని ప్రపంచ ఆర్థిక వేదిక ప్రకటించింది.

అంతర్జాతీయ స్థాయికి...

నేడు ఫ్రాన్స్, యూఏఈ, సింగపూర్‌లతోపాటు ఏడు దేశాలు యూపీఐ సేవలను అనుమతిస్తున్నాయి. 2028కల్లా 20 దేశాలకు యూపీఐని విస్తరించాలని రిజర్వు బ్యాంకు లక్షిస్తోంది. ముఖ్యంగా బ్రిక్స్‌ప్లస్, సార్క్ సభ్యదేశాలతోపాటు, ఇతర వర్ధమాన దేశాల్లోనూ ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. దీన్ని భారతదేశ ఆర్థిక దౌత్యంగా పరిగణించవచ్చు. డిజిటల్ లావాదేవీలతోపాటు సైబర్ మోసాలూ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2014-24 మధ్య దేశంలో లక్ష రూపాయలు, అంతకుమించిన డిజిటల్ చెల్లింపు మోసాలకు సంబంధించి 63,315 కేసులు నమోదయ్యాయి. మొత్తం రూ.733 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. రిజర్వు బ్యాంకు విధానాల్లో తరచూ మార్పులు జరగడం ఫిన్‌టెక్ సంస్థలకు సమస్యగా ఉంది. డిజిటల్ వ్యక్తిగత సమాచార రక్షణ చట్టం అమలులోకి వచ్చిన తరవాత ఫిన్‌టెక్ రంగం మరింత పురోగమించడం వీలవుతుంది. ప్రస్తుతం విస్తరణే ప్రధానంగా సాగుతున్న ఫిన్‌టెక్ సంస్థలు లాభాల్లో పడితేనే ఈ రంగం భవిష్యత్తు పదిలంగా ఉంటుంది.

# పేరుకే వరంగల్ జిల్లా..పాలనంతా హనుమకొండే!



వరంగల్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వహయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాను ఏకంగా ఆరుజిల్లాలుగా మార్చివేసింది. ఈ క్రమంలో వరంగల్ రూరల్ జిల్లాగా మొగ్గతొడిగి కొద్ది కాలానికి పేరుతోపాటు పరిధిలో చేర్పులు చేసుకుని ఏర్పడిన వరంగల్ జిల్లాకు ఏళ్ళు గడుస్తున్నా..బాలారిష్టాలు వీడడంలేదు. తొలుత వరంగల్ రూరల్ జిల్లాకు జిల్లా కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేయాలో తెలియని అయోమయానికి తెరదించుతూ మార్పులతో వరంగల్ జిల్లాగా మార్చారు. అయితే, నేటికీ పాలనంతా హనుమకొండలోని తాత్కాలిక జిల్లా కలెక్టరేట్ కేంద్రంగానే సాగుతోంది. వరంగల్ కేంద్రంగా ప్రభుత్వపాలన ఎప్పుడు ప్రారంభముతుందోనని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. గత బీఆర్ఎస్ హయంలోనూ, నేటి కాంగ్రెస్ పాలనలోనూ ఇంకా ఈ కల నెరవేరలేదని వరంగల్ వాసులు చెబుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అట్టహాసంగా 2016 అక్టోబరు 11 న నూతనంగా వరంగల్ రూరల్ జిల్లాను ప్రకటించారు. వరంగల్ రూరల్ జిల్లాగా ప్రకటిచిన 2021 ఆగస్టు వరకూ ఈ జిల్లాకు రంగూ..రూపులేకుండా పోయింది. తాత్కాలికంగా హనుమకొండలో జిల్లా కలెక్టరేట్ ను ఏర్పాటు చేసి అక్కడి నుంచే పాలన కొనసాగిస్తున్నారు. తదుపరి నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ రూరల్ జిల్లాకు జిల్లా కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేయాలో తేల్చుకోలేకపోయారు. ఈ విషయంలో అప్పటి ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడం, ప్రభుత్వ పెద్దలు పరిష్కరించలేక చివరికి చేతులెత్తేశారు. ఈ క్రమంలో రెండో సారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వరంగల్ రూరల్ జిల్లా సమస్య మరోసారి ఎజెండా పైకి వచ్చింది. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామంటూ ప్రకటించి వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఉ న్న వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని వరంగల్ రూరల్ జిల్లా పరిధిలోకి చేర్చి జిల్లా పేరును వరంగల్‌గా మార్పు చేశారు. జిల్లా కేంద్రంగా వరంగల్‌ను ప్రకటించి జిల్లా రూపురేఖల్లో స్వల్పమార్పులు చేపట్టారు. కొద్ది రోజులకు పాత ఆజంజాహి మిల్లు స్థలంలో నూతన కలెక్టరేట్ భవన నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ప్రాథమిక స్థాయి పనులు ప్రారంభించిన కొద్ది రోజులకు ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో సైతం ఈ కలెక్టరేట్ పనులు నత్తనడకనసాగుతున్నాయి.

ప్రజలకు పాలన అందుబాటులో

ప్రజలకు అందుబాటులో అధికారులుంటారని, పాలనా సౌలభ్యం కోసమంటూ రాష్ట్ర వ్యాప్తంగా పాత పది జిల్లాలను 33 జిల్లాలుగా విభజించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విభజన సందర్భంగా జనగామ, ములుగు ప్రజల నుంచి వచ్చిన తీవ్ర ఆందోళన, డిమాండ్ మేరకు కొత్త జిల్లాలు తెరపైకి వచ్చాయి. దీంతో జిల్లాల సంఖ్య ఆరుకు పెరిగింది. తర్వాత కొద్ది కాలానికి చేర్పులు మార్పులు చేశారు. తొలుత ప్రకటించిన వరంగల్ అర్బన్ జిల్లాలోని వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని తొలగించి హనుమకొండ జిల్లాగా, వరంగల్ తూర్పును వరంగల్ రూరల్ జిల్లాలో కలుపుతూ వరంగల్ జిల్లాగా చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు జిల్లాలు వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జనగాం, ములుగు, భూపాలపల్లిగా విభజించారు. తర్వాత జరిగిన పరిణామాల్లో కొద్ది మార్పులు చేపట్టారు.

జిల్లాల విభజనపై భిన్నవాదనలు

కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి భిన్నవాదనలున్నాయి. జిల్లాల ఏర్పాటుకు ఒక ప్రాతిపదిక అంటూ లేకుండా చేశారనే విమర్శలున్నాయి. మరోవైపు స్థానికుల ఒత్తిడికి తలొగ్గి కొన్ని జిల్లాలు, తమ రాజకీయ ప్రాధాన్యతలో మరికొన్ని జిల్లాలు, నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాలను బట్టి ఇంకొన్ని జిల్లాలు ఏర్పాటు చేశారనే అభిప్రాయం ఉంది. కేసీఆర్ లక్కీ నెంబర్ ఆధారంగా జిల్లాల విభజన సాగిందనే ఆరోపణలున్నాయి. పూర్వ జిల్లాకు ఉండే వైభవం, రాజకీయ ఐక్యత లేకుండా జిల్లాలను విభజించారనే విమర్శలున్నాయి. దీనికి భిన్నంగా మారుమూల ములుగు లాంటి ప్రాంతాలను జిల్లాలుగా ప్రకటించడంతో ప్రజలకు పాలన అందుబాటులోకి వచ్చిందనే అభిప్రాయం ఉంది. తమ ప్రాంతాల అభివృద్ధికి దోహదం చేసిందనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అశాస్త్రీయంగా, హేతుబద్ధతలేకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన జిల్లాల విభజనపై ఆరోపణలు చేసింది. తాము అధికారంలోకి వస్తే జిల్లాల ఏర్పాటును సమీక్షిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. జిల్లాల విభజన పైన శాస్త్రీయ ప్రమాణికంతో సమీక్షిస్తామని ప్రకటించిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. దీంతో జిల్లాల విభజన పై తీవ్ర చర్చ సాగింది. ఈ క్రమంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుకు బదులు జిల్లాల సంఖ్య తగ్గుతుందనే చర్చ ప్రారంభమైంది. ఒకే పట్టణంగా ఉన్న వరంగల్ నగరాన్ని విభజించడం సరైందికాదనే అభిప్రాయం కొందరు వ్యక్తం చేశారు. మరి కొందరు మాత్రం హనుమకొండను కాదని చాలా కాలానికి వరంగల్ ప్రాంతానికి గుర్తింపు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాగే రాష్ట్రంలో కొన్ని జిల్లాలను తిరిగి కలుపుతారనే చర్చ సాగింది. అయితే జిల్లాలు ఒకసారి ఏర్పాటైన తర్వాత దాన్ని రద్దు చేస్తే సెంటిమెంటు నెలకొనే అవకాశం ఉంది. ఈ తేనెతుట్టెను కదిలిస్తే ఇబ్బందులు ఏర్పడుతాయనే అభిప్రాయం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ ఈ అంశం పై ప్రశ్నించేందుకు సిద్ధంగా ఉంది. ఈ కారణంగానే జిల్లా విభజన పై సమీక్ష తాత్కాలికంగా వాయిదా వేశారని భావిస్తున్నారు. అయినప్పటికీ వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ఏర్పాటు చేస్తారనే ప్రచారం ఉంది. దీంతో ప్రస్తుత వరంగల్ జిల్లా ఉ నికిలో ఉంటుందా? లేదా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీని వల్లే పాలన వరంగల్‌కు బదలాయించకుండా, ఇక్కడికి కార్యాలయాలు తరలించకుండా చేస్తున్నారనే విమర్శలున్నాయి. నిర్మాణం ప్రారంభించినా జిల్లా కలెక్టరేట్ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయనే అనుమానం ఉంది. ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

కొత్త కలెక్టరేట్ ను పూర్తి చేయండి: కలెక్టర్ సత్య శారద

నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాల నిర్మాణా పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. వరంగల్ లోని పాత ఆజంజాహి మీల్స్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్న నూతన కలెక్టరేట్ భవన సముదాయాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మూడు అంతస్తుల నిర్మాణాలను, కలెక్టర్ క్వార్టర్స్, అడిషనల్ కలెక్టర్ క్వార్టర్స్ మొదటి, రెండవ అంతస్తులలో డిజైన్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించారు. స్ట్రక్చరల్ పనులు పూర్తయినందున ఫీనిషింగ్ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# స్థానిక ఎన్నికల్లో త్రిముఖ పోరు.. గెలిచేది ఎవరు?




హైదరాబాద్,తెలంగాణలో స్థానిక సమరానికి త్వరలోనే నగారా మోగనుంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతున్న వేళ, ఈ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు అగ్నిపరీక్షగా మారాయి. పదేళ్ల అధికారాన్ని కోల్పోయి పూర్వవైభవం కోసం పరితపిస్తున్న బీఆర్ఎస్, అధికారంలో ఉన్నా కాసింత ప్రజా వ్యతిరేకతను సహజంగానే ఎదుర్కొంటున్న కాంగ్రెస్, కేంద్రంలో కొండంత బలమున్నా రాష్ట్రంలో పునాదుల కోసం పాకులాడుతున్న బీజేపీ.. ఈ మూడు శక్తుల మధ్య జరగబోయేది కేవలం ఎన్నిక కాదు, రాజకీయ కురుక్షేత్రం!అసెంబ్లీ ఎన్నికల సమయంలో లాగే, తెలంగాణలో స్థానిక ఎన్నికలు కూడా హెూరాహెూరీగా జరగనున్నాయి. చావో రేవో అనేది తేలిపోనున్న ఈ మహా సంగ్రామంలో ఎవరి వ్యూహం ఏ స్థాయిలో ఫలిస్తుంది? ప్రజల నాడి ఎ టువైపు ఉంది? అం తిమంగా స్థానిక సామ్రాజ్యాన్ని శాసించేది ఎవరో చూద్దాం..

కేసీఆర్ చాణక్యం వర్సెస్ అంతర్గత కుంపట్లు

పదేళ్ల పాటు తెలంగాణను ఏకఛత్రాధిపత్యంగా ఏలిన గులాబీ దళం, అధికారం కోల్పోయాక తీవ్ర గందరగోళంలో చిక్కుకుంది. పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరిందని, కవిత లేఖ ఎపిసోడ్ వంటివి ఆ లొసుగులను బజారుకీడ్చాయని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ అంతర్గత కుమ్ములాటలు పార్టీని కోలుకోలేని దెబ్బతీస్తాయని ప్రత్యర్థులు భావిస్తుండగా, సరిగ్గా ఇక్కడే అధినేత కేసీఆర్ తనదైన చాణక్యం ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన గనుక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగితే, సెంటి మెంట్‌తో పాటు, పాత సంక్షేమ పథకాల జ్ఞాపకాలతో బీఆర్ఎస్ ఓటు బ్యాంకు తిరిగి పుంజుకునే అవకాశం ఉ ంది. అధికార కాంగ్రెస్‌పై నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ వేస్తున్న ప్రతి అడుగు ఉత్కంఠ రేపుతోంది. అయితే,సొంత ఇంటిని చక్కదిద్దుకోకుండా రణరంగంలోకి దూకితే ఫలితం ఎలా ఉంటుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

అధికారం అండ.. కలిసి వస్తుందా?

అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అసలు సవాళ్లు మొదలయ్యాయి. ముఖ్యంగా, రైతు భరోసా, రుణమాఫీ వంటి మెగా హామీల అమలులో జాప్యం జరగడం అనేది రైతన్నలలో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇది స్థానిక ఎన్నికల్లో గ్రామీణ ఓటు బ్యాంకుకు గండి కొట్టే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మార్క్ దూకుడుతో వేల ఉద్యోగ నియామకాలు చేపట్టడం ద్వారా నిరుద్యోగ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తు న్నారు. ఈ పాజిటివ్ వైబ్‌ను ఆయన ఎంతవరకు ఓట్లుగా మలుచుకోగలరు? మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పథకాలు, అధికార బలం కాంగ్రెస్‌కు శ్రీరామరక్షగా నిలుస్తాయా? లేక హామీల వైఫల్యం చివరకు శాపంగా మారుతుందా? అనేది చర్చనీయాంశం. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రయాణం కత్తిమీద సాములాగే కనిపిస్తోంది. అయితే అధికారంలో ఉండటం ఆ పార్టీకి కలిసి వచ్చే అంశం. ఇది స్థానిక ఎన్నికల్లో చాలాసార్లు రుజువైంది కూడా. ఇక గ్రామానికి నిధులు రావాలంటే, పనులు కావాలంటే అధికార అభ్యర్థులను గెలిపించడం మంచిదనే అభిప్రాయం సాధా రణంగా గ్రామీణ ప్రజల్లో ఉ ంటుంది. ఇది అధికార పార్టీకి తప్పకుండా ప్రయోజనం చేకూరుస్తుంది.

కొత్త అధ్యక్షుడికి.. కఠిన సవాలే!

“ఢిల్లీలో మనదే హవా, గల్లీలో మనమెందుకు తక్కువ?” అన్నట్లుగా బీజేపీ పరిస్థితి ఉంది. కేంద్రంలో తిరుగులేని శక్తిగా ఉన్నా, రాష్ట్రంలో మాత్రం ఆశించిన స్థాయిలో పుంజుకో లేకపోతోంది. నిత్యావసరాల ధరల మంట, పెట్రోల్ బాదుడు వంటివి ప్రజలలో బీజేపీపై తీవ్ర వ్యతిరేకతను పెంచుతున్నాయి. దీనికి తోడు, పార్టీలో “బయటకు ఐక్యత రాగం, లోపల వర్గాల కుంపటి” అన్న చందంగా పరిస్థితి తయారైంది. తెలంగాణ బీజేపీకి ఇటీవలే ఎంపికయిన కొత్త అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఇది ఒక రకంగా కఠిన సవాలే.. అయితే, బలమైన క్యాడర్ ఉన్న కొన్ని ప్రాంతాలు, హిందూత్వ కార్డు, ఆపరేషన్ సిందూర్, మోడీ ఇమేజ్‌తో ఎన్నికల్లో గట్టెక్కాలని భారతీయ జనతా పార్టీ గట్టిగా ప్రయత్నిస్తోంది. కానీ, స్థానిక సమస్యలపై పోరాడకుండా, కేవలం జాతీయ అంశాలతో స్థానిక ఎన్నికల్లో నెగ్గుకు రావడం సాధ్యమేనా?

ఈ ఎన్నికలు.. జీవన్మరణ సమస్య!

ఈ స్థానిక ఎన్నికల్లో త్రిముఖ సంగ్రామం హెూరాహెూరీగా సాగడం ఖాయం. బీఆర్ఎస్ ఉనికిని కాపాడుకోవడానికి, కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ భవిష్యత్తుకు పునాది వేసుకోవడానికి ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా చూస్తున్నాయి. పార్టీల వ్యూహాలు, నేతల మాటల గారడీ ఎలా ఉన్నా, అంతిమంగా ప్రజా తీర్పే శిరోధార్యం. ఈ స్థానిక సమరం, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఒక సెమీ ఫైనల్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించే ఈ కురుక్షేత్రంలో విజేత ఎవరో తేలాలంటే, ఫలితాల వరకు వేచి చూడాల్సిందే!

## లిక్కర్ కేసులో అసలు దోషి జగన్

నెల్లూరు,ఏపీ లిక్కర్ కేసులో అసలు బాస్ జగనేనని ప్రపంచానికి తెలిసిపోయిందని టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ భయంతోనే జగన్ అతి క్రూర మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఘాటు విమర్శలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ డిప్రెషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల్లో విలన్స్ నరికేయండి.. ఆ నా కొడుకుని అని అంటారు.. నువ్వు కూడా అదే డైలాగ్ చెబుతావా? ఇటువంటి వాళ్లని చూస్తే రాజకీయాల్లోకి ఎందుకొచ్చామా అనిపిస్తుందని అంటూ కామెంట్స్ చేశారు. టీడీపీ ముఖ్య నేతలు ఏమి చేశారని జైల్లకి పంపారని ప్రశ్నించారు. చంద్రబాబు ఇళ్లు, పార్టీ కార్యాలయంపై దాడులు ఎందుకు చేయించారని నిలదీశారు. జగన్ బుద్ధిమంతుడు.. తాము అరాచకవాదులమా అంటూ ఫైర్ అయ్యారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారని విమర్శించారు.

# ఫ్యూచర్ పాలిటిక్స్‌పై ఓ క్లారిటీకి వచ్చారా?

హైదరాబాద్,పార్టీనే తనదంటున్నారు.. అధినేతను ఒక్క మాట అనడానికి కూడా ఇష్టపడట్లేదు. అపోజిషన్ గులాబీబాస్‌ను విమర్శిస్తే కూడా ఆమె సహించట్లేదు. కానీ అన్నతో పేచీ..కేసీఆర్ చుట్టూ దయ్యాలంటూ కుంపటి రాజేసి..పొలిటికల్ జంక్షన్‌లో నిల్చున్నారు ఎమ్మెల్సీ కవిత. కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు ఇచ్చినా..చివరకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చినా..ఆమె రియాక్ట్ అయ్యారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఏకంగా ఇందిరాపార్క్ దగ్గర నిరసన కూడా తెలిపారు.ఆ ధర్నాలో ఒక్క బీఆర్ఎస్ నేత కూడా పాల్గొనలేదు..అది వేరే సంగతి. సరే అదంతా అలా ఉన్నా..లేటెస్ట్‌గా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో మొదలైన వివాదం%శా% కవితపై ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం లేచాయి. సోషల్ మీడియాలో అన్నివర్గాలు మల్లన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కూడా మల్లన్న మాటలను తప్పుబట్టారు. అయితే సొంత పార్టీ నుంచి మాత్రం కవితకు మద్దతు లభించలేదు.ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జగదీశ్వర్ రెడ్డి మినహా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులే కాదు పార్టీ ముఖ్యనేతలెవరూ మల్లన్న వ్యాఖ్యలపై కనీసం స్పందించలేదు. ఇదే ఎమ్మెల్సీ కవితను మరింత అసంతృప్తికి గురిచేస్తోందట. తనకు పార్టీ అండగా లేకపోవడం..కనీసం మాట వరుసకు అయినా ఖండిస్తూ ఓ ప్రకటనో, ట్వీటో చేయకపోవడం కవితను కలచివేస్తోందట. అందుకే ఇక కారులో ఉండే పరిస్థితి లేదనే నిర్ణయానికి కవిత వచ్చేశారన్న టాక్ విన్పిస్తోంది.. .బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్ సర్కార్ చర్యలను అపోజిషన్ బీఆర్ఎస్ తప్పుబడుతోంది. ఆర్డినెన్స్ తెచ్చి హడావుడి చేసే ప్రయత్నం తప్ప చిత్తశుద్ధి లేదని విమర్శిస్తోంది. ఇదే సమయంలో జాగృతి తరఫున కవిత సంబరాలు చేయడం బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఎమ్మెల్సీగా ఉంటూ పార్టీ లైన్‌కు విరుద్ధంగా కవిత వెళ్తున్నారన్న సంకేతాలు మంచివి కావని పలువురు కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. సేమ్‌టైమ్ ఆమె కాంగ్రెస్‌తో టచ్‌లో ఉ న్నారని గతంలోనే వార్తలు వచ్చాయి. లేటెస్ట్‌గా తీన్మార్ మల్లన్న కూడా అదే విషయాన్ని చెప్పారు. మొన్నటి క్యాబినెట్ విస్తరణలోనే కవిత మంత్రి కావాల్సి ఉండే అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఈ డెవలప్‌మెంట్స్ నేపథ్యంలో కవితను బీఆర్ఎస్ అధినాయకత్వం చాలా లైట్ తీసుకుంటుందట.

కవితను కేసీఆర్ పట్టించుకోవట్లేదా?

మొత్తం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సుదీర్ఘంగా భేటీ అయి..బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం, బనకచర్ల, లోకల్ బాడీ పోల్స్, పార్టీ ఫ్యూచర్ ప్లాన్స్‌పై డిస్కస్ చేశారట. కానీ కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు గురించి గానీ..కవిత సంబరాల అంశానికి సంబంధించి గానీ ఒక్కమాట కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని తెలుస్తోంది.కనీసం ఆమె పేరును కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని..దీంతో కేటీఆర్, హరీశ్‌లు కూడా ఆ విషయాన్ని మాట్లాడలేదని బీఆర్ఎస్ ఇన్ సైడ్ టాక్. ఇక కాళేశ్వరం విచారణకు వెళ్లేప్పుడు కేసీఆర్‌ను కలిసేందుకు కవిత వెళ్లగా అప్పుడు కూడా ఆయన కనీసం మాట్లాడడానికి ఇష్టపడలేదన్న లీకులు వచ్చాయి. అనారోగ్యంతో హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ పొందుతున్న తండ్రిని పరామర్శించేందుకు వెళ్తే అక్కడ కూడా కవితను కేసీఆర్ పట్టించుకోలేదట.ఈ పరిస్థితులన్నీ గమనించిన కవిత..ఇక తాను బీఆర్ఎస్‌లో ఉండలేనని సన్నిహితులతో చెప్తున్నారట. పార్టీలో ఉండడమా.. బయటకు రావడమా? అనే విషయంపై అత్యంత క్లోజ్‌గా ఉండేవాళ్లతో డిస్కస్ చేస్తున్నారట కవిత.

## నటి రన్యారావుకు ఏడాది జైలు

బెంగళూరు, అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయి సంచలనం సృష్టించిన కన్నడ నటి రన్యారావు కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రన్యారావుకు ఏడాది పాటు జైలు శిక్ష పడింది. విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ బోర్డు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో రన్యారావుతో పాటు- మరో ఇద్దరు నిందితులైన తరుణ్ కొండారు రాజు, సాహిల్‌లకు కూడా ఇదే శిక్ష విధించినట్లు బోర్డు తెలిపింది. అక్రమ రవాణాకు సంబంధించి బలమైన ఆధారాలు ఉన్న నేపథ్యంలో శిక్షా కాలంలో వారు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని తెలిపింది. దీంతో ముగ్గురు నిందితులు ఏడాది పాటు- జైల్లోనే ఉండాల్సిఉంది. ఈ కేసులో ప్రతి మూడు నెలలకు ఒకసారి విచారణలు జరుగుతాయని పేర్కొంది. ఇలా ఏడాది వరకు కొనసాగుతాయని వెల్లడించింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ మార్చి తొలి వారంలో రన్యారావు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆమె నుంచి 14.3 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో ఆమె నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేసి రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. ఇక, అక్రమంగా బంగారం తరలించడంలో రన్యారావు సహచరులైన తరుణ్ కొండూరు రాజు, సాహిల్ జైన్‌లు కీలక పాత్ర పోషించినట్లు- దర్యాప్తులో వెల్లడైంది. దీంతో వారిని కూడా అధికారులు అరెస్టు చేశారు.

## బీహార్‌లో ఆందోళన కలిగిస్తున్న హత్యలు

పాట్నా,అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్‌లో హత్యల పరంపర ఆందోళన కలిగిస్తోంది. మొన్నటికి మొన్న బీజేపీ నేత, వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా ఇంటి దగ్గరే హత్యకు గురయ్యారు. కారులో ఇంటికి చేరిన ఆయన్ను అతి సమీపం నుంచి తుపాకీతో కాల్చడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నుంచి ఇంకా తేరుకోక ముందు తాజాగా గురువారం ఉదయం పట్టపగలు ఆస్పత్రిలో కరుడుగట్టిన ఒక నేరస్థుడ్ని ప్రత్యర్థి గ్యాంగ్ తుపాకులతో కాల్చి చంపింది. ఈ ఘటన రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నితీష్ ప్రభుత్వంలో ప్రజలకు భద్రత కరవైందని విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. కరుడుగట్టిన నేరస్థుడు చందన్ మిశ్రా వైద్యం నిమిత్తం పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. పాట్నాలోని పరాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ప్రత్యర్థి వర్గానికి ఐదుగురు సభ్యులు కలిగిన ముఠా ఆస్పత్రిలోని చందన్ మిశ్రా ఉన్న గదిలోకి ప్రవేశించి తుపాకులతో విరుచుకుపడ్డారు. బుల్లెట్లు- దూసుకెళ్లడంతో చందన్ మిశ్రా అక్కడికక్కడే చనిపోయాడు. ఇక తుపాకీ శబ్దాలకు రోగులు, బంధువులు హడలెత్తిపోయారు. అనంతరం దుండుగులు అక్కడ నుంచి పరారయ్యారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయింది. బక్సర్ జిల్లా నివాసి అయిన చందన్ మిశ్రా కరుడు గట్టిన నేరస్థుడు. అతడిపై డజన్ల కొద్దీ కేసులున్నాయి. భాగల్పూర్ జైల్లో ఉంటున్నాడు. వైద్య చికిత్స కోసం పెరోల్‌పై పాట్నా ఆస్పత్రికి వచ్చాడు. అయితే ప్రత్యర్థి వర్గం కాల్చి చంపినట్లు పోలీసులు తెలిపారు. బాక్సర్ జిల్లా పోలీసుల సాయంతో నిందితులను గుర్తించినట్లు- పోలీసులు వెల్లడించారు. ఈ హత్యలో ఆస్పత్రి సిబ్బంది ప్రమేయం ఉందా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు- సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ కార్తీకాయ్ శర్మ పేర్కొన్నారు. చందన్ మిశ్రా గాయాలతో ప్రాణాలు కోల్పోయాడని చెప్పారు. నేరస్థులను పట్టుకుంటామని ఉప ముఖ్యమంత్రి విజయ్ సిన్హా హామీ ఇచ్చారు. ఇటువంటి సంఘటన దురదృష్టకరమని... దీనిపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని చెప్పారు. నేరస్థులను పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు.

## పోలీస్ అధికారులను జైలు పాలయ్యేలా చేసిందెవరు

అమరావతి,జగన్ మోహన్ రెడ్డి మీడియాలో మాట్లాడిన తీరు చూస్తుంటే చూస్తుంటే.. పాత సినిమాల్లో విలన్ రాజనాల క్యారెక్టర్ గుర్తుకు వస్తోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు అన్నారు. చేయాల్సిన ఘోరాలన్నీ చేసేసి.. తాపీగా ఉండేలా నటించిన రాజనాలను తలదన్నేలా జగన్ నటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. జగన్ మోహన్ రెడ్డి తన పార్టీ కార్యాలయాన్ని మూసేసి.. స్టూడియో పెట్టుకుంటే మంచిదంటూ హితవు పలికారు. ఈమేరకు మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై నక్కా ఆనందబాబు విరుచుకుపడ్డారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సినిమాల్లో చేసిన వాటిని అనుకరిస్తే తప్పేంటి అంటూ జగన్ అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాల్లో చేసే హత్య, మానభంగాలు సమాజంలో చేసినా తప్పు లేదంటారా అంటూ టీడీపీ నేత కౌంటర్ ఇచ్చారు. వివేకం కూడా సినిమానే కదా..కోర్టుకు వెళ్లి ఎందుకు ఆపావంటూ జగన్‌కు ఆనందబాబు సూటి ప్రశ్న వేశారు. రఘురామ కృష్ణం రాజును పోలీసులతో హింసించిన విషయం మరిచారా అంటూ మండిపడ్డారు. అప్పులు చేసింది చాలక.. ఇంకా విమర్శలు చేస్తున్నావా అంటూ చివాట్లు- పెట్టారు. 11 సీట్లు- ఇచ్చి ప్రజలు ఛీకొట్టినా.. ఇంకా సిగ్గు లేకుండా కామెంట్లు- చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. అవసాన దశలో ఉన్న పార్టీని బతికించుకోవాలనే ఆలోచనతోనే వైసీపీ అనే డ్రామా కంపెనీని జగన్ నడుపుతున్నారన్నారు. పోలీసుల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ నిరంతరం మాట్లాడుతున్నారని.. ఓ డీఐజీని మాఫియా డాన్ అంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చీటికి మాటికి ప్రెస్‌మీట్లు- పెట్టిన పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు ఎందుకు సైలెంట్‌గా ఉంటున్నారో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. పోలీసులను జగన్ దూషిస్తుంటే.. పోలీస్ అధికారుల సంఘం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడో 25వ ర్యాంక్‌లో ఉన్న అధికారిని డీజీపీని చేసి.. జగన్ తన పబ్బం గడుపుకున్నారని విరుచుకుపడ్డారు. పోలీసులను జగన్ తన రాజకీయ కక్షలకు వాడుకున్నారని ఆరోపించారు. జగన్‌ను నమ్ముకుంటే పోలీసులకు కారాగార వాసం దక్కిందని... పీఎస్సార్ ఆంజనేయులు వంటి వారు జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. లోకేష్ సభలను.. పాదయాత్రను అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. మాట్లాడే మైక్ లాక్కున్నారని.. నించున్న స్టూల్ గుంజేశారని అప్పటి సంఘటనలు గుర్తు చేశారు టీ-డీపీ నేత. చంద్రబాబు ఇంటి గేటును తాళ్లతో కట్టి బయటకు రాకుండా చేసిన జగన్ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడతారా అంటూ మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే జగన్ అజెండా అంటూ వ్యాఖ్యలు చేశారు. అమర్ రాజా బ్యాటరీ, లులు గ్రూపు, కాగ్నిజెంట్ కంపెనీలే కాదు.. చివరకు డ్రాయర్ల కంపెనీని కూడా జగన్ తరిమేశారంటూ ఫైర్ అయ్యారు. జగన్ పనికి మాలిన వాడని... ప్రజా జీవితానికి పనికి రాడని ఏపీ ప్రజలు తీర్పు ఇచ్చారని నక్కా ఆనంద బాబు పేర్కొన్నారు.నా బీసీలు.. నా ఎస్సీలని జగన్ అన్నారని.. వారెవరూ జగన్‌కు ఓటేయలేదన్నారు. బీసీలను బానిసలుగా.. ఎస్సీలను అంటరానివారిగా చూశారని వ్యాఖ్యలు చేశారు. బడుగులపై జగన్ హయాంలో దమనకాండ జరిగిందని తెలిపారు. సొంత సామాజిక వర్గం అయితే గుమ్మం లోపలికి..

# రాజా సింగ్ ఏక్ అకేలా!

హైదరాబాద్,గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ కరుడుగట్టిన హిదుత్వ వాది. అందులో ఎటువంటి అనుమానం లేదు. ఆ ఇమేజ్ తోనే ఆయన వరసగా మూడు సార్లు బీజేపీ టికెట్ పై పోటీ చేసి గెలిచారు. మూడు సార్లు బీజేపీ ఎమ్మెల్యే అయినా.. ఎందుకో ఆయన కమలం పార్టీలో ఇమడ లేక పోయారు. నిజానికి.. రాజాసింగ్ కమల దళంతో కలిసి నడిచిన పుష్కర కాల ప్రస్థానంలో అనేక మార్లు పార్టీతో, పార్టీ విధానాలతో, పార్టీ నాయకత్వంతో విభేదించారు. పార్టీ నుంచి ఒకటి రెండు సార్లు సార్లు సస్పెండ్ కూడా అయ్యారు. అయినా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి బీజేపే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చొరవతో పార్టీ కేంద్ర నాయకత్వం సస్పెన్షన్ ఎత్తేసి గోషామహల్ టికెట్ మళ్ళీ ఆయనకే ఇచ్చింది. రాజా సింగ్ మళ్ళీ గెలిచారు. హ్యాట్రిక్ సాధించారు.అయినా ఆయనలో మార్పు రాలేదు. కథ మొదటికి వచ్చింది. చివరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక సందర్భంగా.. తనకు పోటీచేసే అవకాశం ఇవ్వలేదని ఆరోపించి, పార్టీకి రాజీనామా చేశారు. మీకో దండం.. పార్టీకో దండం అంటూ రాజీనామా లేఖ అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఇచ్చేశారు. ఆయన ఆ రాజీనామా లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపించడం, ఆయన ఆమోదించేయడం చకచకా జరిగిపోయాయి. ఒక విధంగా ఇది రాజా సింగ్ ఉహించని పరిణామం. నిజానికి జాతీయ స్థాయిలోనూ హిందుత్వ వాదిగా మంచి గుర్తింపు ఉన్న రాజా సింగ్ విషయంలో బీజేపీ అధినాయకత్వం ఇంత వేగంగా ఇంతటి కఠిన నిర్ణయాన్ని తీసుకుంటుందని రాజే సింగ్' మాత్రమే కాదు.. ఎవరూ ఉహించలేదు.కానీ.. బీజేపీ జాతీయ నాయకత్వం కనీసం వివరణ అయినా అడగకుండానే రాజాసింగ్ రాజీనామాను ఆమోదించేసింది. దీంతో.. బీజేపీలో రాజాసింగ్ ప్రస్థానం ముగిసింది.ఈ నేపథ్యంలో.. రాజా సింగ్ రాజకీయ భవిష్యత్ ఏమిటి? ఆయన ఎటు అడుగులు వేస్తారు? ఏమి చేస్తారు? అనేది ఆసక్తిగా మారింది. నిజానికి.. రాజా సింగ్ పార్టీకి రాజీనామా చేసినా, హిందుత్వ బాట తప్పననీ, కాంగ్రెస్,బీఆర్ఎస్ వంటి సెక్యులర్ పార్టీలలో చేరననీ ప్రకటించారు. అంతే కాకుండా.. రాజా సింగ్ తనకు పార్టీ జాతీయ నాయకత్వంతో ఎలాంటి విభేదాలు లేవనీ, ఇప్పటికీ ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వాన్ని సమర్ధిస్తానని చెపుతున్నారు. సో.. రాజ సింగ్ రాజకీయ భవిష్యత్ ప్రస్తుతానికి ప్రశ్నార్ధకంగానే మిగిలింది. ఒక విధంగా అటూ ఇటూ కాకుండా గాలిలో తేలుతోంది అనుకోవచ్చు. అదలా ఉంటే.. పార్టీకి రాజీనామా చేసిన రాజా సింగ్ ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తారా? లేక ఏ పార్టీకి చెందని సభ్యునిగా కొనసాగుతారా? అనేది చూడవలసి వుంది. నిజానికి పార్టీకి రాజీనామా చేసిన సందర్భంలోనే రాజా సింగ్ తన రాజీనామా లేఖను అసెంబ్లీ స్పీకర్ కి పంపి తన సభ్యత్వాన్ని రద్దుచేయమని కోరాలని పార్టీ అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు. అయితే.. రాజా సింగ్ రాజీనామాను ఆమోదించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు



నడ్డా కానీ.. రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు కానీ ఇంతవరకు అసెంబ్లీ స్పీకర్ కు ఎలాంటి లేఖా రాయలేదని సమాచారం. అంతే కాకుండా.. ప్రస్తుతానికి పార్టీకి అలాంటి ఆలోచన కూడా లేదని ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు సంబంధించి రాజా సింగే నిర్ణయం తీసుకోవాలని పార్టీ నాయకులు అంటున్నారు. సో ... ప్రస్తుతం అమర్ నాథ్ యాత్రలో ఉన్న రాజా సింగ్ తిరిగి వచ్చిన తర్వాత కానీ తదుపరి ఘట్టం మొదలు కాదని అంటున్నారు. రాజా సింగ్ తనంతట తానుగా స్పీకర్ ఫార్మేట్ లో రాజీనామా సమర్పిస్తే మాత్రం మరో ఉప ఎన్నిక అనివార్యం అవుతుంది. అదలా ఉంటే బీజేపీ రాజా సింగ్ రాజీనామా అంశాన్ని పక్కన పెట్టి, నియోజక వర్గంలో పట్టును నిలుపుకునే ప్రయత్నాలు ప్రారంభించింది బీజేపీ.కాగా, ఇటీవల పార్టీ నూతన అధ్యక్షుడు రామచంద్ర రావు అభినందన సభ పేరిట నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో చాలా పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు రాజా సింగ్ పట్ల అభిమానం వ్యక్త పరుస్తూనే.. పార్టీ ఫస్ట్ అంటున్నారు. అలాగే.. రాజాసింగ్ ను పార్టీ దూరం చేసుకోలేదు.. ఆయనే పార్టీని దూరం చేసుకున్నారంటున్నారు. అంతే కాదు.. ఉప ఎన్నిక అంటూ వస్తే బీజేపీ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి.. గోషామహల్ మొదటి నుంచి బీజేపీకి మంచి పట్టున్న నియోజక వర్గం. రాజ్ సింగ్ కంటే ముందు రామ స్వామి, ప్రేమ సింగ్ రాథోడ్ ఇదే నియోజక వర్గం నుంచి గెలిచారని గుర్తు చేస్తున్నారు. అంతే కాదు.. రాజా సింగ్' పార్టీకి రాజీనామా చేసినా మా వాడే ,హిందుత్వం కోసం, బీజేపీ అభ్యర్ధిని గెలిపిస్తారు అంటున్నారు. బీజేపీ నాయకుల పార్టీ కాదు.. కార్యకర్తల పార్టీ. గతంలో ముఖ్యమంత్రులుగా చేసిన కళ్యాణ్ సింగ్, ఉమా భారతి, యడ్యూరప్ప, మన రాష్ట్రంలో టైగర్ నరేంద్ర వంటి పార్టీని వదిలి వెళ్ళిన మహా మహా నాయకులే.. తప్పు తెలుసుకుని తిరిగి సొంత గూటికి చేరిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అదొకటి అయితే, ఒకప్పుడు..అసెంబ్లీలో ఒకే ఒక్కడుగా ఉన్న రాజాసింగ్ ..ఇప్పుడు నియోజక వర్గంలో ఏక్ అకేలా.. అయ్యారని అంటున్నారు.

## అవినీతి సొమ్ము గురించి మాట్లాడు

న్యూఢిల్లీ,విమర్శలు చేసే ముందు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, కాళేశ్వరం దుర్వినియోగంపై సమాధానం చెప్పాలని కెటిఆర్‌కు కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్రెడ్డి సవాల్ చేశారు. పదేళ్లపాటు అడ్డంగా రాష్ట్రాన్ని దోచుకుని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్‌పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. అసలు పదేళ్లు అధికారంలో ఉండి, కృష్ణా, గోదావరి నదులపై ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తెచ్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కేటీఆర్, ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధత గురించి నోరు విప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేటీఆర్ పాలనలో కట్టినా, అది కూలిపోయింది. ఈ ప్రాజెక్టు పేరిట హరిరామ్, నూనె శ్రీధర్, మురళీధరరావు వంటి ఇంజనీర్లు వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏసీబీ లెక్కలు తేల్చే పనిలో ఉంటే, కేటీఆర్‌కు సమాధానం చెప్పే దమ్ము లేదు. తన రక్తాన్ని రంగరించి కాళేశ్వరం కట్టానని చెప్పే కేసీఆర్ ఫ్యామిలీ దోపిడీ ఎంతో తెలంగాణ ప్రజల ఊహకే వదిలేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు దీటుగా కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. నేను పెడితే పెళ్లి, ఇంకెవరు పెట్టినా పిండాకూడే అన్నాడట వెనకటికి అంటూ కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఈ సన్నాసి పదేళ్ల పాలనలో ఏం సాధించాడని ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబద్ధతపై మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. కాళోజీ వంటి మహాకవి పేరు తీసుకునే అర్హత కేటీఆర్‌కు ఉందా? తన ఫాంహౌస్‌లు, ప్రగతి భవన్‌లు పది నెలల్లో కట్టుకుని కులికిన ఈ దుర్మార్గుడు, వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని పదేళ్లు మొండి గోడలుగా వదిలేశాడు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాన్ని పూర్తి చేసింది. అయినా, కాళోజీ పేరు తీసుకోవడానికి కేటీఆర్‌కు సిగ్గు అనిపించడం లేదా అని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో దోచుకుని, పార్టీ పేరు మార్చుకుని, ప్రజలను ఏమార్చిన కేటీఆర్‌కు ఈ రోజు తెలంగాణ భావోద్వేగాలు పట్టవా? అధికారం కోల్పోయిన కసితో, రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య అనుమానాలు సృష్టించి, తెలంగాణ ప్రజల మెదళ్లలో విషం నింపాలని చూస్తున్నాడు. కానీ, ఈ కుట్రలు ఫలించవని ఎంపీ అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కుల కోసం దేవుడితోనైనా కొట్లాడతానని రేవంత్ రెడ్డి గారు చేసిన ప్రతిజ్ఞ తెలంగాణ ప్రజల గుండెలను తాకింది. కానీ, తెలంగాణ భవిత కోసం దేవుడితోనే కాదు, కల్వకుంట్ల దెయ్యాలతో సైతం పోరాడాల్సిన అవసరం ఉందని ఈసారి గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు ఈ కేటీఆర్ లాంటి అవకాశవాదుల కుట్రలను ఎప్పటికీ సాగనివ్వరని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సన్నాసి కేటీఆర్‌కు చరిత్ర ఒక గుణపాఠం నేర్పిందని, తెలంగాణ ప్రజలను ఎవరూ మోసం చేయలేరని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## మానవ అక్రమ రవాణా గుట్టురట్టు

విశాఖపట్నం, మానవ అక్రమ రవాణాను అడ్డుకున్న విశాఖ పోలీసులు పలువురిని అరెస్ట్ చేశారు. గతకొంతకాలంగా ఈ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు నిఘా వేసి పట్టుకున్నారు. ఈక్రమంలో పలువురిని విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. కాంబోడియా, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్ వంటి దక్షిణాసియా దేశాలకు యువతీయువకులను తరలిస్తున్న ముఠాలు, సైబర్ నేరాల కేంద్రాలపై విశాఖ సీపీ శంకబ్రత బాగ్చి చొరవతో ఉక్కుపాదం మోపారు. ఉద్యోగం పేరుతో నిరుద్యోగుల్ని విదేశాలకు అక్రమ రవాణా చేస్తోన్న పలువురిని అరెస్టు చేశామని, వారి చేతుల్లో మోసపోయిన 85 మంది అమాయకుల్ని స్వదేశానికి సురక్షితంగా రప్పించామని సీపీ తెలిపారు. కొందరు ఏజెంట్లు- డేటా ఎంట్రీ ఉద్యోగం, రూ.లక్షల్లో జీతం అంటూ ఆశచూపి, ఆకర్షణీయమైన ప్రకటనలతో యువతను మోసం చేసి ఉచ్చులో పడేస్తున్నాయి. నిరుద్యోగ యువతను నమ్మిస్తూ విదేశాల్లోని చైనా ఆధారిత సైబర్ స్కామ్ కంపెనీల్లో నేరాలు చేయించడానికి తరలిస్తున్నారు. ఈ ఘటనల్లో 9 కేసుల్లో 22 మందిని అరెస్టు చేశారు. ఈనెల 14న కాంబోడియాకు నలుగురు యువతీయువకులను డేటా ఎంట్రీ- జాబ్ పేరుతో పంపించడానికి ప్రయత్నించిన గాజువాకకి చెందిన ఏజెంట్ సురేశ్, ఆదిలక్ష్మి అలియాస్ అనుని విశాఖపట్నం ఎయిర్‌పోర్టు వద్ద అరెస్ట్ చేశారు. సురేశ్ ఇదివరకే కాంబోడియాకు వెళ్లి అక్కడ చైనా స్కామ్ కంపెనీలో పనిచేశాడు. అక్కడ విజయ్‌కుమార్ అలియాస్ సన్నీతో పరిచయం పెంచుకొని ఇటీ-వల భారత్‌కు వచ్చి.. కాంబోడియాలోని సైబర్‌స్కామ్ కంపెనీకి ఏజెంట్‌గా మారాడు. ఇప్పటి వరకు 12 మందిని పంపించినట్లు- విచారణలో తేలింది. కాంబోడియా, మయన్మార్‌కు వెళ్లి చిక్కుకున్న 85 మందిని విశాఖకు రప్పించాని సిపి తెలిపారు.మిగతా బాధితులను కూడా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. అనధికారిక ఏజెంట్లను నమ్మి ప్రజలు మోసపోవద్దని సీపీ తెలిపారు.

## జమ్మూ కశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదా

న్యూఢిల్లీ,జమ్మూ కశ్మీర్‌కు పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఓ లేఖ పంపించారు. ఇది హోదా పునరుద్ధరణే అవుతుందని వివరించారు. 21 నుంచి ఆరంభమమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలోనే కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాసంపూర్ణ స్థాయిలో దక్కేలా చేసేందుకు తగు బిల్లు తీసుకువచ్చి, చట్టం రూపొందించాలని ఈ లేఖలో వీరిరువురు తెలిపారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా ఖర్గే, లోకసభలో విపక్ష నేతగా రాహుల్ ఉన్నారు. బుధవారం వారు పంపించిన లేఖ రాజకీయ వర్గాలలో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆర్టికల్ 370 రద్దు తరువాత జెకె స్వరూపం మారింది. కేంద్ర పాలిత ప్రాంతం అయింది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సి ఉంది. లడఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని కూడా ఈ లేఖలో తెలిపారు. ప్రధాని మోడీ ఈ విషయాలలో స్పందించాల్సి ఉందన్నారు. గడిచిన ఐదేళ్లుగా జమ్మూ కశ్మీర్ ప్రజలకు రాష్ట్ర హోదా లేకుండా పోయింది. అక్కడి జనం ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్రం స్పందించాల్సి ఉందని, జనాభిప్రాయం మేరకు ఇందుకోసం చట్టం తీసుకురావడమే ప్రధాన అంశం అవుతుందని తెలిపారు. జమ్ముకశ్మీరీల డిమాండ్‌లో నిజాయితీ ఉంది. పైగా రాష్ట్రహోదా చట్టబద్ధం. వారి రాజ్యాంగ , ప్రజాస్వామిక హక్కుగా రాష్ట్ర హోదా ఉందని తెలిపారు. గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్రాల హోదా కట్టబెట్టిన సందర్భాలు ఉన్నాయి. జమ్మూ కశ్మీర్ విషయంలో ఇందుకు విరుద్ధంగా జరిగిందిం. స్వాతంత్ర్య భారతదేశంలో తొలిసారిగా ఓ ప్రాంతం రాష్ట్రప్రతిపత్తిని కుదించి కేంద్ర పాలిత ప్రాంతం (యుటి) చేసేశారని విమర్శించారు. ప్రధాని మోడీ పలు సార్లు రాష్ట్ర హోదా కల్పించడం జరుగుతుందని చెప్పారని, 2024 మే 19న భువనేశ్వర్‌లో జరిగిన సభలో ఈ రాష్ట్ర హోదా కల్పిస్తామని చెప్పారని, దీనిని తాము గుర్తు చేస్తున్నామని లేఖలో తెలిపారు. శ్రీనగర్‌లో కూడా మోడీ ఇదేచెప్పారని, పార్లమెంట్‌లో చెప్పినట్లు-గానే ఈ హామీ నిలబెట్టు-కుంటామని కేంద్రం చివరికి సుప్రీంకోర్టుకు కూడా తెలియచేసుకుందని ఇరువురు నేతలు తెలిపారు. సాధ్యమైనంత వరకూ తొందరల్లోనే పునరుద్ధరణ జరుగుతుందని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న లడఖ్ ప్రాంతీయుల హక్కులు వారి భూములు, గుర్తింపు, వారి సాంస్కృతిక విశిష్టతల పరిరక్షణకు ప్రత్యేకించి ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి కేంద్రం చర్యలు తీసుకోవల్సి ఉంది.

# ఏంది సార్లు ఇది.? ప్రాజెక్ట్ కట్టింది నీళ్ల కోసం కాదా.! పైసలు దోచుకోవడానికా.?




హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రవహించిన నీళ్లెన్నో తెలీదు కానీ, ఈ ప్రాజెక్టు ద్వారా వెలికి వస్తున్న అవినీతి అధికారుల సంఖ్య మాత్రం నానాటికీ పెరుగుతూనే ఉందా? మొన్న హరిరాం, నిన్న నూనె శ్రీధర్, నేడు మురళీధర్ రావు ఉదంతాలు మనకేం చెబుతున్నాయి? మురళీధరరావుకు ఇన్నేసి కోట్ల రూపాయల ఆస్తులెలా వచ్చాయి? ఈ ముగ్గురి ఆస్తులె ఇంత ఉంటే, ఇక కిందున్న వారి ఆస్తులెంత? పైనున్నవారు కాజేసినది ఇంకెంత? ఆ డీటైల్స్ ఏంటి? ఇప్పుడు చూద్దాం.

90 వేల కోట్ల ఈ ప్రాజెక్టు నీళ్ల కోసం కాదా?

వీరి ఆస్తుల విలువే ఇన్ని వందల కోట్లు పలుకుతుంటే.. కింది స్థాయి అధికారుల వాటా ఎంత? పైనున్న వారు వెనకేసిన కట్టల పాములెన్ని? 90 వేల కోట్ల ఈ ప్రాజెక్టు నీళ్ల కోసం కాదా? అక్రమాస్తులు పోగెయ్యడం కోసమా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ ప్రాజెక్టు వ్యవహారంలో మొదట బయట పడ్డ అవినీతి తిమింగలం భూక్యా హరిరాం అక్రమాస్తుల విలువ చూసి ఆశ్చర్యపోయారందరూ. ఆయన ఎంత ఈఎన్సీగా పని చేసినా.. మరీ ఇన్ని కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టడం సాధ్యమయ్యే పని కాదు. అసలు ఆ ఆస్తుల వివరాలు తెలుసుకునే కొద్దీ కళ్లు బైర్లు కమ్ముతాయి. మొత్తం 14 ప్రాంతాల్లో సోదాలు చేసిన గుర్తించిన అధికారులు.. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు, షేక్ పేట్ లో ఒక విల్లా, కొండాపూర్లో మరో విల్లా, మాదాపూ లో ఒక ఫ్లాట్, నార్సింగిలో ఒక ఫ్లాట్, అమరావతిలో ఒక కమర్షియల్ సైట్, మర్క్యూక్ మండలంలో 28 ఎకరాల వ్యవసాయ భూమి, పఠాన్ చెరులో 20 గుంటల భూమి, బొమ్మల రామారంలో 6 ఎకరాల మామిడి తోటతో కూడిన ఫామ్ హౌస్, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లా పూర్, మిర్యాలగూడలో స్థలాలు.. గుర్తించారు అధికారులు. వీటికి తోడు బంగారు ఆభరణాలు, ఇతరత్రా విలువైన వస్తువుల విలువ కట్టిన అధికారులకు కళ్లు బైర్లు కమ్మాయి. మూడు బ్యాంకు లాకర్లతో పాటు ఆయన భార్య ఇతర బంధుమిత్రులపేరిట కొన్న బినామీ ఆస్తులన్నిటినీ గుర్తించిన అధికారులకు మతి పోయింది.

వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ భవనాలు

ఇక సెకండ్ వికెట్ సంగతి చూస్తే. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేసిన.. నూనె శ్రీధర్ అవినీతి బాగోతం.. అబ్బో అంతకు మించి అన్నట్టుగా ఉంటుంది. 19 రెసిడెన్షియల్ ప్లాట్లు, హైదరాబాద్ లోని తెల్లాపూర్ లో విల్లా, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ లో మూడు ఇండివిడ్యువల్ భవనాలు. 16 ఎకరాల వ్యవసాయ భూమి, కరీంనగర్ లో వివిధ హోటళ్లలో వాటాలు గుర్తించి షాకయ్యారు ఏసీబీ అధికారులు. మరో ట్విస్ట్ ఏంటంటే శ్రీధర్ తన కొడుకు పెళ్లిని ఏకంగా థాయిల్యాండ్ లో భారీ వ్యయం చేసి జరిపినట్టు తెలిసింది. విపరీతమైన అక్రమాదాయం గల శ్రీధర్ ఈ డబ్బు ఎలా ఖర్చు చేయాలో అర్థం కాక.. కొడుకు పెళ్లిని విదేశాల్లో గ్రాండ్ గా చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం పట్టుబడ్డ మాజీ ఈఎన్సీ మురళి అవినీతి సరళి ఎలా ఉందో చూస్తే.. ఈయన సంతకం చేయనిదే బిల్లులు పాస్ కావు. ఈ అధికారం అడ్డు పెట్టుకుని.. మురళీధర్ రావు.. భారీ ఎత్తున అవినీతికి పాల్పడినట్టు గుర్తించింది ఏసీబీ. ఆయన బంజారా హిల్స్ నివాసం, కరీంనగర్, జహీరాబాద్, హైదరాబాద్ లోని ఆయన బంధుమిత్రుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు నిర్వహించిన అధికారులకు దిమ్మతిరిగిపోయింది. భారీ ఎత్తున అక్రమాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేశారు అధికారులు.

కొడుకు కంపెనీకి కాళేశ్వరంలో సబ్ కాంటాక్టు

మురళీధర్ రావుకు కొండాపూర్ లో ఒక విల్లా ఉన్నట్టు గుర్తించారు. బంజారాహిల్స్,యూసఫ్ గూడ, బేగంపేట, కోకాపేట ప్రాంతాల్లో ఫ్లాట్లు ఉన్నాయి. ఇక కరీంనగర్ లో ఒక కమర్షియల్ బిల్డింగ్, హైదరాబాద్ లో మరో కమర్షియల్ బిల్డింగ్ ఉన్నట్టు బయట పడింది. కోదాడలో ఒక అపార్ట్ మెంట్ కూడా ఉన్నట్టు తేలింది. జహీరాబాద్ లో 2 కిలోవాట్ల సోలార్ విద్యుత్ పవర్ ప్రాజెక్టు ఉన్నట్టు గుర్తించారు. వరంగల్ లో ఒక అపార్ట్ మెంటును కట్టినట్టు చెబుతున్నారు అధికారులు. అంతేనా 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు కూడా డాక్యుమెంట్లు దొరికాయి. హైదరాబాద్ లో ప్రైమ్ ఏరియాల్లో నాలుగు రెసిడెన్షియల్ ప్లాట్లు ఉన్నట్టు పత్రాలు లభించాయి. మోకిలాలో మరో 6500 గజాల ప్లాట్ గుర్తించారు. మూడు ద్విచక్రవాహనాలు, ఒక మెర్సిడెస్ బెంజ్ కారు ఉన్నట్టు తేలింది. పెద్ద మొత్తంలో బంగారు నగలు, డిపాజిట్లు ఉన్నట్టు తేల్చారు. దీంతో మురళీధర్ రావుపై అక్రమాస్తుల కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. అంతే కాదు తన కొడుకు అభిషేక్ రావు పేరిట ఉన్న ఒక కంపెనీకి కాళేశ్వరంలో సబ్ కాంట్రాక్టులు ఇప్పించినట్టు తెలిసింది.

ఉమ్మడి ఆంధ్ర ప్రభుత్వంలోనే మురళీధర్ రావు రిటైర్

ఈ మొత్తం డీటైల్స్ చాలు.. వీరక్కడ ఏం చేశారో చెప్పడానికి. ఎవరికి వారు అందిన కాడికి దోచుకోవడం. ఎడా పెడా ఆస్తులు కూడబెట్టడం. వీళ్ల బ్యాంకు బ్యాలెన్సులెంత బలపడుతూ వచ్చాయో.. ప్రాజెక్టు నిర్మాణం అంత బలహీన పడుతూ వచ్చిందని అంటారు నిపుణులు. ఇందులో ట్విస్ట్ ఏంటంటే మురళీధర్ రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోనే రిటైర్ అయితే.. తిరిగి ఆయన పదవీ కాలం 13 ఏళ్ల పాటు పొడిగించారు. మేడిగడ్డ విజిలెన్స్ రిపోర్టు వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఈయన్ను తొలిగించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఎంతలేసి తవ్వకాలు సాగించారో తెలీదు గానీ.. ఈ భారీ అవినీతి తిమింగలాల అవినీతిని తవ్వి పోయడానికి పెద్ద ఎత్తున కష్టపడాల్సి వచ్చింది ఏసీబీ అధికారులు. ఉన్నది చెబితే చాలు అసలేం జరిగిందో అదే తెలిసిపోతుంది. కాళేశ్వరం విషయంలో సరిగ్గా ఇదే జరిగినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకూ పట్టుబడ్డ ముగ్గురు అధికారులే ఇంత పెద్ద మొత్తంలో వెనకేస్తే.. మిగిలిన వారి పరిస్థితేంటి? అన్నది ఆందోళనకరంగా మారింది. మరీ ముఖ్యంగా మురళీధరరావు లీలలు ఈ మొత్తం ప్రాజెక్ట్ లోనే ప్రత్యేక అధ్యాయంగా చెబుతారు. అంతగా ఈయన అవినీతి లీలల వెలికి వచ్చాయని చెబుతారు అవినీతి నిరోధకశాఖ అధికారులు.

ఆ కాంట్రాక్టర్, ప్రభుత్వంపై జనాగ్రహం

కాళేశ్వరం ప్రాజెక్టు విలువ.. లక్ష కోట్లకు పైగా. ఇదంతా ప్రజా ధనమే. ఎందరో శ్రామికులు, మరెందరో కష్టార్జితం ఇందులో దాగి ఉంటుంది. అలాంటి ప్రజా ధనం మేసిన ఒక్కో అవినీతి అధికారి బాగోతం బయట పడుతుండటంతో.. తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర ప్రజలు. ఏంటీ అన్యాయం? ఎందుకింతటి అక్రమం? ఒక వేళ ఇదే ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయానికి ఆయువు పట్టుగా మారితే.. ఈ కీర్తి మనకే దక్కుతుందన్న ఆలోచన వీరెందుకు చేయలేక పోయారు? ఇదీ ప్రస్తుతం సర్వత్రా జరుగుతోన్న చర్చ. ఎప్పుడో కట్టిన నాగార్జున సాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల నాణ్యత గురించి వాటి మన్నిక గురించి ఇంకా కథలు కథలుగా చెప్పుకుంటూ ఉంటాం. ఆ ప్రధాని కాలంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగింది.. ఈ జమిందారు ఇందుకు భూములిచ్చారని ఇంకా తలుచుకుంటూనే ఉన్నాం. ఈ గొప్ప అవకాశాన్ని వీరంతా కోల్పోయారా? అంటే అవుననే తెలుస్తోంది. గుజరాత్ లో నలభై ఏళ్ల క్రితం కట్టిన ఒక బ్రిడ్జి కూలిపోతే.. ఆ కాంట్రాక్టర్ ని, ప్రాజెక్టు నిర్మించిన నాటి ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్య పడుతూ పోస్టులు పెడుతున్నారు కొందరు. అంటే మనం కళ్లు మూసుకుని పాలు తాగేస్తే.. తర్వాత ఎవ్వరూ గుర్తించరులే అనుకుంటే పొరబాటు. చరిత్ర ప్రతిదీ గుర్తు పెట్టుకుంటుంది. ఈ కనీస విచక్షణ లేకుండానే వీరంతా కలసి.. ఈ ప్రాజెక్టుతో ఒక ఆట ఆడుకున్నట్టు కనిపిస్తోంది. డబ్బు కక్కుర్తికి చరిత్ర హీనులుగా మిగిలిపోవడానికి కూడా వీరు వెనకాడలేదని తెలుస్తోంది.

మాజీ ఈ ఎన్సీ మురళీధరరావు కథే వేరు

తాజాగా పట్టుబడ్డ మాజీ ఈఎన్సీ మురళీధరరావు కథే వేరుగా చెబుతారు. ఆయన ప్రతి సంతకానికీ ఒక విలువ కట్టినట్టు తెలుస్తోంది. బిల్లు పాసు కావాలంటే సార్ ఖాతాలో పెద్ద మొత్తం జమ కావల్సిందేనట. ఈయన ఈఎన్సీ అడ్మిన్ గా పని చేసినపుడు.. కాంట్రాక్టర్ల ద్వారా తన సన్నిహితులకు సబ్ కాంట్రాక్టులు ఇప్పించారట. తన కుమారుడ్ని బలవంతానా ఒక కంపెనీలో డైరెక్టర్ గా చేర్చి.. మరీ అక్రమార్జన చేశారంటే అర్థం చేసుకోవచ్చని అంటారు అధికారులు. చేసే అవినీతి ఎక్కడా బయట పడకుండా ఇలాంటి ఎత్తుగడ వేసినట్టుగా గుర్తించారు. సబ్ కాంట్రాక్టు పనులలో నాటి మంత్రుల అనుచరులు.. వరంగల్ కి చెందిన వారే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. మేఘా కంపెనీ ఉద్యోగి, మాజీ ఈఎన్సీ వెంకటరామారావు ద్వారా కూడా తతంగం నడిచినట్టు అనుంటున్నారు. అతడి లీలలే కాళేశ్వరం కరెప్షన్ కి దారి తీసినట్టు తెలుస్తోంది. 2019లో రిటైర్ అయిన ఎస్ వెంకటేశ్వర్లను ఈఎన్సీ బాధ్యతలిచ్చి కొనసాగించారు. ఇపుడు కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీకి ఈయనే అప్పట్లో ఈఎన్సీ. రివైజ్ అంచనాలతో వందల కోట్లు అక్రమంగా వివిధ కాంట్రాక్టర్ల నుంచి తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఒక్క బ్యారేజీకే వంద సార్లకు పైగా.. ఎస్టిమేషన్ పెంచి నాణ్యత గాలికి వదిలినట్టు తెలుస్తోంది. ఈయన అక్రమాస్తులపై కూడా ఏసీబీ ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తోంది. అలాగే కాళేశ్వరం కమీషన్ కూడా ఈ మొత్తం అవినీతి బాగోతంపై సీరియస్ గా ఉన్నట్టు చెబుతున్నారు.

ఇక ప్రాజెక్టు సృష్టికర్తల అవినీతి పరిస్థితి ఏంటి?

ఈ మధ్య కాలంలో అరెస్టయిన అధికారులెవరని చూస్తే.. 2025 జూలై 15న మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీ ధరరావు. జూన్ 10న ఇరిగేషన్ ఎగ్జిక్యూఇవ్ ఇంజినీర్ నూనె శ్రీధర్. మే 10న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎగ్జిక్యుటివ్ ఇంజినీర్ అర్రంరెడ్డి అమరేందర్ రెడ్డి- అరవై వేలు లంచం తీస్కుని పట్టుబడ్డం. 2024 డిసెంబర్ 12న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నికేష్ కుమార్. ఈయన వంద కోట్ల అక్రమాస్తుల కేసులో అరెస్ట్. ఇక ఇదే ఏడాది జూన్ 1న రంగారెడ్డి జిల్లాకు చెందిన ఈఈ భన్సీలాల్, ఏఈ కార్తిక్, నవంబర్ 25న పెద్దపల్లి జిల్లాకు చెందిన ఏఈ నర్సింగరావు- 20 వేలు లంచం తీస్కుంటు బుక్. ఏప్రిల్ 26న కాళేశ్వరం ప్రాజెక్ట ఇంజినీర్ ఇన్ చీఫ్ భూక్యా హరిరాం- ఆదాయానికి మించిన కేసుల్లో అరెస్టయ్యారు. వీరి అక్రమార్జనే ఇలా ఉంటే.. ఇక ఈ ప్రాజెక్టు సృష్టికర్తల అవినీతి పరిస్థితి ఏంటి? అసలీ ప్రాజెక్టు అంచనాలు పదే పదే పెంచిందే అంతులేని అవినీతికి పాల్పడ్డానికా? ప్రాజెక్టుల విషయంలో ఇలాంటి అవినీతి బాగోతం బయట పడితే.. విదేశాల్లో అయితే ఏకంగా ఉరి శిక్ష విధిస్తారని అంటారు న్యాయ నిపుణులు. ఎందుకంటే ఒక ప్రాజెక్టు అంటే అది ఎన్నో ప్రాంతాలు, మరెన్నో జీవితాలకు సంబంధించిన విషయం. ఒక్కోసారి ప్రాజెక్టు నిర్మాణంలో తేడా వస్తే పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతుంది. ఇందులో ఆస్తి, ప్రాణ నష్టాలు కూడా భారీగానే ఉంటాయి.

అంచెలంచెలుగా అంచనాలు పెరిగి లక్ష కోట్లు క్రాస్

తెలంగాణలోని 13 జిల్లలకు ప్రయోజనం చేకూరేలా.. మొదట ఈ ప్రాజెక్టును 80 వేల 500 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టగా.. అంచెలంచలుగా అంచనాలు పెంచుతూ ఈ మొత్తం విలువ లక్ష కోట్లు దాటించినట్టు తెలుస్తోంది. రాజలింగం వంటి వారు ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించిన ప్రజల సొమ్ము దోచిన వారెవరో తేలాల్సిందే అంటూ.. వాజ్యాలు వేయడం.. సంగతి తెలిసిందే. మరి అధికార గణం విషయలోనే ఇన్నేసి లుకలుకలు- లాలూచీలు- ఆమ్యామ్యాలు బయట పడుతుంటే.. ఆ పైనున్న గత పాలక పెద్దల పరిస్థితేంటి? ఆ మొత్తం అవినీతి విలువ ఇంకెంత మేర ఉంటుందో ఊహించడానికే భయమేస్తుందని అంటున్నారు నిపుణులు.

# కాం(గెసుకు దగ్గరగా.. రేవంత్ పై కక్షగా..



హైదరాబాద్,తెలంగాణ జాతిపితగా తనను పిలిపించుకోవడానికి ఇష్టపడే కల్వకుంట్ల చంద్రశేఖరరావు తనయ.. కల్వంకుట్ల కవిత.. ఇప్పుడు నెమ్మదిగా కాం(గెసుకు దగ్గరవుతున్నారా? తమ ఇంటి పార్టీ భారత రాష్ట్ర సమితిలో తనను చిన్నచూపు చూస్తున్న తీరుపై కినుక వహించి ఉన్న కల్వకుంట్ల కవిత.. తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానానికి మార్గం ఏమిటో ఆ(లెడీ డిసైడ్ అయ్యారా? 'ప్రస్తుతం అధికారంలో ఉన్న' అనడం కంటె, 'రెండుదఫాలు రాష్ట్రాన్ని పరిపాలించిన' భారత రాష్ట్ర సమితిని మట్టి కరిపించి అధికారంలోకి వచ్చిన కాం(గెసుకు దగ్గరకావడమే తనకు శ్రేయస్కరం అని ఆమె భావిస్తున్నారా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలవుతోంది.బీసీ రిజర్వేషన్ బిల్లుపై తెలంగాణ సర్కారు తీసుకువచ్చిన ఆర్డినెన్సును.. భారాస పార్టీ లైన్స్ కు వ్యతిరేకంగా.. కల్వకుంట్ల కవిత ఏకపక్షంగా సమర్థిస్తుండడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది.కవిత ఇప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్టుగా ఉంది. ఆమె తన ఇంట్లో పుట్టిన రాజకీయ పార్టీలో తిరుగులేని యువరాణిగానే ఇన్నాళ్లూ చెలామణీ అయ్యారు. కానీ.. అన్నయ్య కేటీఆర్ తో వచ్చిన విభేదాలు, ఆధిపత్య పోరాటాలు, తండ్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆమె గురించి పట్టించుకోవద్దని పార్టీ శ్రేణులకు జారీచేసిన హెచ్చరికలు.. వీటన్నింటి నేపథ్యంలో ఆమె గులాబీదళంలో.. రాలిన రేకుగా మారిపోయారు.గులాబీ పార్టీ ఆమెను పూర్తిగా లూప్ లైన్లోకి పెట్టేసింది. తనను ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో అరెస్టు చేసినప్పటి నుంచి.. భారాస పెద్దగా పట్టించుకోలేదని, బిజెపిపై సరైన రీతిలో దాడికి దిగలేదని, భాజపాతో చెట్టపట్టాలు వేసుకుని నడుస్తున్నదనే ప్రజలు అనుకుంటున్నారని కవిత చాలా తీవ్రమైన విమర్శలు చేశారు. మొత్తానికి భారాసతో కవిత బంధం అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నది గానీ.. దాదాపుగా తెగిపోయినట్టే. మరి ఆమె భవిష్యత్ రాజకీయం సంగతేంటి?సంకేతాలు ఆమె కాం(గెసుకు దగ్గరవుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి గుసగుసలు ఇదివరలో కూడా ఉన్నాయి. కానీ.. ఆమె తాజా ప్రసంగాల్లో.. రేవంత్ రెడ్డి తక్షణం తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉన్నదని డిమాండ్ చేయడం ద్వారా.. అలాంటి ప్రచారాల్ని నమ్ముతున్న వారిలో కొంత సందిగ్ధత క్రియేట్ చేయదలచుకున్నట్టున్నారు. అదే సమయంలో తాను కాం(గెసుకు దగ్గరవుతున్న సంకేతాల్ని తండ్రికి, అన్నకు యావత్ గులాబీదళానికి కూడా పంపదలచుకున్నట్టు అర్థమవుతోంది.ఎ ందుకంటే.. బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్సు చాలా మంచి చర్యగా కవిత అభివర్ణిస్తూ, భారాస దానిని వ్యతిరేకించడాన్ని తప్పుపడుతున్నారు. ఈ విషయంలో భారాస నాయకులు ఎప్పటికైనా తన బాటలోకే రావాల్సి ఉంటుందని కూడా ఆమె జోస్యం చెబుతున్నారు. తీన్మార్ మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలపై భారాస నాయకు లు స్పందించకపోవడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్టుకూడా చెప్పుకొచ్చారు. మొత్తానికి కవిత గురించి కాం(గెస్ పార్టీ నుంచి ఆ(లెడీ బహిష్కృతుడైన తీన్మార్ మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, ఇప్పుడు కవిత తన ఇంటి పార్టీని తూలనాడుతూ.. కాం(గెస్ ప్రయత్నాన్ని అభినందిస్తుండడం.. అదే సమయంలో రేవంత్ రాజీనామాకు డిమాండ్.. ఈ పరిణామాలన్నీ గమనిస్తే.. ' కాం(గెసుకు దగ్గరగా.. రేవంత్ పై కక్షగా..' ఆమె అడుగులు సాగుతున్నట్టుగా పలువురు భావిస్తున్నారు.

# రాజా సింగ్ రాజీనామా గోషామహల్ ఉప ఎన్నిక అనుమానమే

హైదరాబాద్,గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన నేపధ్యంలో, జూబ్లీ హిల్స్ నియోజక వర్గంతో పాటుగా గోషామహల్'నియోజక వర్గానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందన్న వ్యూహగానాలు వినిపిస్తున్నాయి. అయితే, బీజేపీకి రాజీనామా చేసిన రాజా సింగ్' ఇంతవరకు ఎమ్మెల్యే పదవికి మాత్రం రాజీనామ చేయలేదు. బీజేపీ అధ్యక్షుడికి రాసిన రాజీనామా లేఖను, అసెంబ్లీ స్పీకర్'కు పంపి, తనను అనర్హుడిగా ప్రకటించమని కోరాలని సూచన చేసారు. అయితే, రాజా సింగ్ ప్రతిపాదనను బీజేపీ తిరస్కరించింది. రాజీనామా చేయాలనుకుంటే రాజా సింగ్' నేరుగా అసెంబ్లీ స్పీకర్'కే టం రాజీనాం లేఖను సంర్పించాలని, బీజేపీ అధికార ప్రతినిధులు స్పష్టం చేసారు. అలాగే, రాజసింగ్' రాజీనామను తిరస్కరించి సందర్భంలోనూ బీజేపీ అధ్యక్షుడు, అనర్హత వేటు అంశాన్ని ప్రస్తావించలేదు. రాజా సింగ్ పార్టీ కోర్టులోకి కొట్టిన బండిని, బీజేపీ తిరిగి ఆయన కోర్టులోకి తిప్పికొట్టింది. అయితే,పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజా సింగ్ చేసిన రాజీనామాను, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించి వారం రోజులు పైగానే అయింది, అయినా, రాజా సింగ్ ఇంత వరకు ఎమ్మెల్యే పదవికి సంబంధించి పెదవి విప్పలేదు. మూడుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు,పార్టీకి కృతజ్ఞతలు చెప్పారు. బీజేపీకి రాజీనామా చేసినా హిదుత్వ సిద్ధాంతాన్ని వదలనని, వేరే పార్టీలో చేరనని చెప్పారు. కార్యకర్తలకు ఉద్భోదలు చేసారు.,కానీ, ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు సంబంధించి మాత్రం ఇంత వరకు మాట్లాడ లేదు. రాజీనామా చేసే సంకేతాలు కూడా కనబడడం లేదు. మరోవంక బీజేపీ కూడా వత్తిడి చేయడం లేదు. సో... రాజీనామా చేస్తారా ? స్వతంత్ర అభ్యర్థిగా కొనసాగుతారా, అనేది ఇంకా స్పష్టం కాలేదు.అదొకటి అలా ఉంటే, ఒక వేళ రాజా సింగ్' స్పీకర్ ఫార్మేట్'లో రాజీనామా సమర్పించినా, స్పీకర్'ను స్వయంగా కలిసి రాజీనామా ఆమోదించమని కోరినా,స్పీకర్' వెంటనే రాజీనామాను ఆమోదిస్తారా? అంటే, అది కూడా జరగక పోవచ్చని పరిశీలకులు అంటున్నారు. ఇప్పటికే, బీఆర్ఎస్ టికెట్ పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత విషయం ఎటూ తేలకుండా వుంది. స్పీకర్' వెంటనే నిర్ణయం తీసుకోవాలని, న్యాయ స్థానాలు సూచించినా, స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు రాజ్



సింగ్ రాజీనామాను తక్షణం ఆమోదిస్తే, స్పీకర్', విమర్శలను ఎదుర్కోనవలసి వస్తుంది. అందుకే, రాజా సింగ్ రాజీనామా చేసినా, స్పీకర్ ఆమోదించక పోవచ్చని పరిశీలకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో గోషామహల్ నియోజక వర్గానికి, ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఇంచుమించుగా లేనట్లే అంటున్నారు. ఒక విధంగా ఇది, రోగి కోరుకున్నది వైద్యుడు ఇచ్చింది ఒకటే అన్నట్లుగా ఉ ందని పరిశీలకులు పేర్కొంటున్నారు. కారణాలు వేరైనా, ఎవ్వరూ కూడా ఉప ఎన్నికను కోరుకోవడం లేదు. అవును,అటు రాజా సింగ్ ఉప ఎన్నిక కోరుకోవడం లేదు, బీజేపీ పట్టుపట్టే పరిస్థితి లేదు.. అన్నిటికంటే ముఖ్యంగా అంతిమ తీర్పు ఇవ్వవలసిన స్పీకర్, తక్షణ నిర్ణయం తీసుకోక పోవచ్చని అంటున్నారు.అందుకే ..గోషామహల్ ఉప ఎన్నికపై ఆశలు పెట్టుకున్న మాధవీలత గోషామహల్ కాకపోతే జూబ్లీ హిల్స్' అంటూ అటుగా చూస్తున్నారు. అక్కడైనా ఇక్కడైనా ఎక్కడైనా గెలుస్తా, అసెంబ్లీలో అడుగు పెడతా అంటన్నారు.అయితే ఆమె ఏకపక్షంగా చేస్తున ప్రకటనల విషయంలో ఇప్పటికీ పార్టీలో వ్యతిరేకత వ్యక్త మవుతోంది. నిజానికి, పార్టీ నాయకత్వం కూడా ఇప్పటికే ఆమెను, హెచ్చరించినట్లు చెపుతున్నారు.మాధవీ లత విష్యం ఎలా ఉన్నా, రాజా సింగ్ రాజీనామా, గోషామహల్ ' ఉప ఎన్నిక రెండూ అనుమానమే, అంటున్నారు.

# తెలంగాణపై చంద్రబాబుకు ఇంకా ఆశలున్నాయా?

హైదరాబాద్,తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ.. పెద్దస్థాయిలో ఉద్యమం జరుగుతున్నప్పుడు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపుగా అన్ని పార్టీలు తమ వైఖరి ఏంటో చాలా స్పష్టంగా తేల్చిచెప్పాయి.. ఒక్క తెలుగుదేశం తప్ప. అప్పట్లో చంద్రబాబు నాయుడు ఆశల సరళి చాలా భిన్నంగా ఉండేది. రెండు రాష్ట్రాల్లోనూ తన పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందని.. తెలంగాణ రాజ్యానికి కొడుకును పట్టాభిషిక్తుడిని చేసేసి, ఆంధ్రప్రదేశ్ రాజ్యాన్ని తాను ఏలుకోవచ్చునని ఆయన అనుకుంటూ ఉండేవారు. దానికి తగ్గట్టుగా.. అప్పట్లో జీహెచ్ఎంసీ ఎన్నికల బాధ్యత మొత్తం, తెలంగాణ ప్రాంత బాధ్యత మొత్తం కొడుకు చేతుల్లో పెట్టారు. ఆ దెబ్బకు రాష్ట్రమంతా పార్టీ పతనం అయిన మాట వేరే సంగతి.ఉ ద్యమకాలంలో ఆయన మాత్రం.. తనకు రెండు ప్రాంతాలూ ముఖ్యమేనని, రెండు ప్రాంతాలూ తనకు రెండుకళ్ల వంటివని నయగారపు మాటలు చెబుతూ.. ప్రత్యేకరాష్ట్రం విషయంలో స్పష్టత ఇవ్వకుండా డోలాయమాన వైఖరి అనుసరించారు. దాని ఫలితంగా రాష్ట్రం ఏర్పడిన వెంటనే.. ఆ ప్రాంతంలో సాధారణంగా ఎంతో బలమైన తెలుగుదేశం పార్టీ సర్వభ్రష్టత్వం చెందింది. ఆ పార్టీకి రాష్ట్ర కార్యాలయం తప్ప మరో అస్తిత్వమే లేకుండాపోయింది.తెలంగాణ లో తెలుగుదేశం అంతరించి, దాదాపు ఒకటిన్నర దశాబ్దం అవుతుండగా.. చంద్రబాబు నాయుడు ఇప్పటికీ ఆ రాష్ట్రం మీద ఆశలు వదులుకోలేదేమో అనే అనుమానం కలుగుతోంది. జలాల పంపిణీ విషయమై ఢిల్లీలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ముగిసిన తర్వాత చంద్రబాబు నాయుడు రెండు తెలుగు రాష్ట్రాలూ తనకు ముఖ్యమేనని వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనంగా పలువురు అంటున్నారు.చంద్రబాబు నాయుడు స్థిరనివాసం ఇప్పటికీ హైదరాబాదులోనే ఉంది. ఆయన తరచుగా ఇక్కడకు వస్తుంటారు. అప్పుడప్పుడూ పార్టీ ఆఫీసులో తెలంగాణ నేతలతో ఓ మీటింగు పెడుతుంటారు. అలా పెట్టిన ప్రతిసారీ.. తెలంగాణలో పార్టీని పునరుజ్జీవింపజేయడం తన లక్ష్యం అంటుంటారు. అది ఎప్పటికీ జరిగేపనిగా మాత్రం లేదు. కానీ ఆయనలో ఆశ



మాత్రం అలాగే ఉన్నట్టుంది. అందుకే రెండు తెలుగు రాష్ట్రాలూ తనకు ముఖ్యం అంటూనే.. తెలంగాణ వ్యక్తం చేస్తున్న భయాల్ని, అనుమానాల్ని పట్టించుకోకుండా బనకచర్ల ప్రాజెక్టు గురించి మాత్రం తన ప్రయత్నాలు ముందుకు తీసుకు వెళుతున్నారు.తెలంగాణలో అన్ని పార్టీలూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు ఎలా సాధించుకోగలుగుతారో అర్థం కావడం లేదు. ఆయన కేంద్రంలో పెత్తనం చెలాయిస్తున్న ఎన్డీయే కూటమిలో రెండో అతిపెద్ద పార్టీకి నాయకుడు గనుక, కనీసం తెలంగాణ భాజపాతోనైనా బనకచర్ల గురించి సానుకూలంగా ఒక మాట చెప్పించగల నేర్పు ఆయనకు ఉన్నదా అనేది అనుమానమే.ఇలాంటి పరిస్తితుల్లో బనకచర్ల పట్టాలెక్కడం కష్టం. కానీ.. చంద్రబాబు మాత్రం.. తెలంగాణ సమాజం తెలుగుదేశానికి ఏదో ఒకనాటికి మళ్లీ పట్టం కడుతుందని ఆశపడుతున్న తరహాలో.. రెండు రాష్ట్రాలూ ముఖ్యం అనే మాట అంటున్నారు. నిర్దిష్టమైన దృక్పథం లేని ఇలాంటి మాటల వల్ల.. రెండు తెలుగురాష్ట్రాలకు మాత్రమే కాదు, తెలుగుదేశం పార్టీకి కూడా చేటు తప్పదని పలువురు అంచనా వేస్తున్నారు.

# మద్యం మత్తులో స్కూల్ బస్ డ్రైవర్లు ... తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త.!



హైదరాబాద్,మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ హైదరాబాద్లో 35 మంది స్కూల్వెహికిల్ డ్రైవర్లు పట్టుబడటం కలకలం రేపుతోంది. విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. పగటిపూట డ్రంకెన్? డ్రైవింగ్ తనిఖీల్లో 25 మంది స్కూల్ బస్ డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. మిగతావారిలో స్కూల్? ఆటోలు, వ్యాన్ల డ్రైవర్లు ఉన్నారు.హైదరాబాద్ నగర రహదారులపై పసి ప్రాణాలతో 'జూదం' ఆడుతున్న డ్రైవర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత రెండు వారాల్లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో మద్యం మత్తులో స్కూల్ వాహనాలు నడుపుతున్న 35 మంది డ్రైవర్లు పట్టుబడటమే కాక, వీరిలో చాలామంది రక్తంలో అత్యధిక ఆల్కహాల్ స్థాయితో పట్టు బడ్డారు. కొన్ని కేసుల్లో Blood Alcohol Content (BAC) స్థాయి 200 mg/ml 400 mg/ml మధ్యగా ఉ ండగా, ప్రభుత్వం అనుమతించే పరిమితి 30 mg/ml మాత్రమే.ఈ కేసులు గత నెలలో నమోదైన మరో ఘటనకు కొనసాగింపుగా వెలుగుచూశాయి. అప్పట్లో 13 మంది స్కూల్ డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. తరచుగా జరుగుతున్న ఈ ఉదంతాలు, విద్యార్థుల రక్షణపై పట్టించుకోని పాఠశాల యాజమాన్యాల అలసత్వాన్ని ఎత్తిచూపుతున్నాయి.పూర్తి నగర వ్యాప్తంగా 28 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో, ప్రధాన కూడళ్ళ వద్ద ు ఉదాహరణకు HPS ఔట్‌గేట్, పరేడ్ గ్రౌండ్, %జూ% పాయింట్ వంటి ప్రాంతాల్లోు రోజూ కనీసం రెండు సార్లు 15–20 వాహనాల చొప్పున తనిఖీలు జరుగుతున్నాయి. డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ టెస్టు జరుపగా వారిలో అనేకమంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారని ట్రాఫిక్ పోలీస్ అధికారి పి. చంద్రశేఖర్ తెలిపారు. తాజా డ్రైవ్లో పట్టుబడిన వారిలో 12 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు, 19 మంది ఆటో డ్రైవర్లు, 4 మంది వ్యాన్ డ్రైవర్లు ఉన్నారు. వీరందరిపై మోటారు వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేయడంతోపాటు, జ్యుడిషియల్? కస్టడీలోకి తీసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. నగరంలో 10,000కి పైగా స్కూల్ వాహనాలు విద్యార్థులను రవాణా చేస్తున్న నేపథ్యంలో ఈ సంఖ్య ప్రమాదకరంగా మారుతోంది. విషయం ఇంతటితో ఆగలేదు. మరో 100 డ్రైవర్లను కూడా పోలీసు శాఖ పట్టుకుంది. వీరిలో 85 మంది ఆటోలు, 15 మంది ప్రైవేట్ వ్యాన్లు ు వీరంతా అనుమతికి మించిన విద్యార్థులను తాము నడిపే వాహనాల్లో కూర్చోబెట్టడం వల్ల పట్టుబడ్డారు. ఇది కూడా రహదారి ప్రమాదాలకు కారణమయ్యే ప్రాథమిక అంశమని ట్రాఫిక్ %ఐజూ% రాహుల్ హెగ్డే పేర్కొన్నారు.ఇవన్నీ కేవలం రాత్రిపూటనే కాదు, రోజుపూట కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ శాఖ డే టైమ్ డ్రంక్ డ్రైవింగ్ చెక్స్ ప్రారంభించింది. 2025 జూలై 16న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తొలి రోజే 25 మంది స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడడం తల్లిదండ్రుల ఆందోళనకు కారణమైంది. ఈ డ్రైవ్ను మింట్ కాంపౌండ్ వద్ద ప్రారంభించిన ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, ఇది హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచనలతో తీసుకున్న వ్యూహాత్మక చర్య అని స్పష్టంగా తెలిపారు. డ్రంకెన్? డ్రైవ్? తనిఖీలు రాత్రి సమయంలో మాత్రమే జరిగుతాయని భావించే మందుబాబులను అడ్డుకోవడానికి పగటిపూట కూడా మద్యం మత్తులో డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరిపై చర్యలు తీసేందుకు ప్రారంభమైన 24ఇ7 ప్రయత్నం. పట్టుబడిన డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, వారి డ్రైవింగ్ లైసెన్స్లు తాత్కాలికంగా రద్దు చేయడం లేదా పర్మనెంట్గా రద్దు చేసే అవకాశముందని పోలీసులు తెలిపారు. కఠినమైన శిక్షలతోపాటు ు అవసరమైతే జైలు శిక్షలు కూడా ఉండొచ్చని చెప్పారు. ఈ పరిస్థితుల్లో, ట్రాఫిక్ పోలీసులు పాఠశాల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేయాలని యోచిస్తున్నారు. ఇప్పటికే పాఠశాలలు తమ డ్రైవర్లకు బ్రీత్? అనలైజర్? పరీక్షలు నిర్వహించాలని సూచనలు ఇచ్చినప్పటికీ, వాటిని పట్టించుకోకపోవడం వల్ల విద్యా శాఖను అప్రమత్తం చేయాలని భావిస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన డ్రైవింగ్ చర్యలను ఉపేక్షించే పాఠశాలలపై NOC రద్దుకు కూడా సిఫారసు చేయనున్నట్టు జోయెల్ డేవిస్ హెచ్చరించారు.ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసు విభాగం ప్రజల సహకారం కోరుతోంది. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరు మద్యం సేవించిన తర్వాత వాహనం నడపరాదని, పోలీసుల తనిఖీల్లో సహకరించాలని కోరారు. మీడియా ద్వారా ఎక్కువ అవగాహన కల్పించేందుకు కూడా అధికారులు పిలుపునిచ్చారు. తద్వారా ఈ చర్యలు దేశంలోని ఇతర నగరాలకు కూడా ఆదర్శంగా నిలవాలని, విద్యార్థుల భద్రతకు కొత్త ప్రామాణికాలు ఏర్పడాలని పోలీస్ శాఖ ఆశిస్తోంది.

## స్వచ్ఛ షహర్ గా హైదరాబాద్ ఎంపిక

న్యూఢిల్లీ, తెలంగాణలోనే స్వచ్ఛ షహర్ గా హైదరాబాద్ ఎంపికయ్యింది. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీ లోనీ విజ్ఞాన్ భవన్ లో గృహనిర్మాణ , పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ కార్యక్రమంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ చేతుల మీదుగా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును పురపాలక పట్టణాభివృద్ధి కార్యదర్శి డా కె ఇలాంబరితి, కమిషనర్ ఆర్ వి కర్ణన్ లు స్వీకరించారు.

# స్థానిక సంస్థలు అత్యధికంగా ఏ జిల్లాలో ఉన్నాయో తెలుసా?




హైదరాబాద్,క్షేత్రస్థాయిలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. వార్డు నుంచి జడ్పీ ఛైర్మన్ వరకు రాబోయే రిజర్వేషన్ల వ్యవహారంపైనే చర్చలు జోరుగా జరుగుతున్నాయి. గ్రామాలు, మండలాల పరిధిలో రిజర్వేషన్లు ఎలా వస్తాయనే అంశంపై అన్ని పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించనుండడంతోనే ఈ రీతిలో గ్రామీణ స్థాయిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం వేగంగా ముందుకు వెళ్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా వార్డులు, పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఛైర్మన్ స్థానాలను ఖరారు చేసింది. అయితే గతంలో ఉన్న పలు పంచయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో స్థానిక సంస్థల సంఖ్య తగ్గింది. 2019లో పూర్తి జడ్పీటీసీల సంఖ్య 570, ఎంపీపీల సంఖ్య 570, ఎంపీటీసీల సంఖ్య 5,817, గ్రామ పంచాయతీల సంఖ్య 12,848, వార్డుల సంఖ్య 1,13,354 ఉండగా ప్రస్తుతం జడ్పీటీసీల సంఖ్య 566, ఎంపీపీలు 566, ఎంపీటీసీలు 5,773, గ్రామపంచాయతీలు 12,778, వార్డులు 1,12,694కు చేరింది. 4 జడ్పీటీసీలు, 4 ఎంపీపీలు, 70 పంచాయతీలు, 44 ఎంపీటీసీలు, 660 వార్డులు తగ్గాయి. అయితే జిల్లాల వారీగా అత్యధికంగా నల్లగొండ జిల్లాలో ఎంపీటీసీల సంఖ్య 353, ఎంపీపీలు 33, జడ్పీటీసీలు 33 ఉండగా అత్యల్పంగా ములుగు జిల్లాలో ఎంపీటీసీలు 83, జడ్పీటీసీలు 10, ఎంపీపీలు10 ఉన్నాయి.ఆదిలాబాద్ జడ్పీటీసీలు20, ఎంపీపీలు 20, ఎంపీటీసీలు 166, భద్రాద్రి కొత్తగూడెం జడ్పీటీసీలు 22, ఎంపీపీ 20, ఎంపీటీసీ 166, హనుమకొండ జడ్పిటీసీ 12, ఎంపీపీ 12, ఎంపీటీసీ 233, జగిత్యాల జడ్పీటీసీ 20, ఎంపీపీ 20, ఎంపీటీసీ216, జనగామ జడ్పీటీసీ 12, ఎంపీపీ 12, ఎంపీటీసీ 134, జయశంకర్ భూపాలపల్లి జడ్పీటీసీ 12, ఎంపీపీ 12, ఎంపీటీసీ 109, జోగులాంబ గద్వాల జడ్పీటీసీ 13, ఎంపీపీ 13, ఎంపీటీసీ 142, కామారెడ్డి జడ్పీటీసీ 25, ఎంపీపీ 25, ఎంపీటీసీ 233, కరీంనగర్ జడ్పీటీసీ 15, ఎంపీపీ 15, ఎంపీటీసీ 170, ఖమ్మం జడ్పీటీసీ 20, ఎంపీపీ 20, ఎంపీటీసీ 283, కుమురంభీం ఆసిఫాబాద్ జడ్పీటీసీ 15, ఎంపీపీ 15, ఎంపీటీసీ 127, మహబూబాబాద్ జడ్పీటీసీ 18, ఎంపీపీ 18, ఎంపీటీసీ 193, మహబూబ్ నగర్ జడ్పీటీసీ 16, ఎంపీపీ 16, ఎంపీటీసీ 175, మంచిర్యాల జడ్పీటీసీ 16, ఎంపీపీ 16, ఎంపీటీసీ 129, మెదక్ జడ్పీటీసీ 21, ఎంపీపీ 21, ఎంపీటీసీ 190, నాగర్ కర్నూల్ జడ్పీటీసీ 20, ఎంపీపీ 20, ఎంపీటీసీ 214, నారాయణపేట జడ్పీటీసీ 13, ఎంపీపీ 13, ఎంపీటీసీ 136, నిర్మల్ జడ్పీటీసీ 18, ఎంపీపీ 18, ఎంపీటీసీ 157, నిజామాబాద్ జడ్పీటీసీ 31, ఎంపీపీ 31, ఎంపీటీసీ 307, పెద్దపల్లి జడ్పీటీసీ 13, ఎంపీపీ 13, ఎంపీటీసీ 137, రాజన్న సిరిసిల్ల జడ్పీటీసీ 12, ఎంపీపీ 12, ఎంపీటీసీ 123, రంగారెడ్డి జడ్పీటీసీ 21, ఎంపీపీ 21, ఎంపీటీసీ 230, సంగారెడ్డి జడ్పీటీసీ 26, ఎంపీపీ 26, ఎంపీటీసీ 271, సిద్దిపేట జడ్పీటీసీ 26, ఎంపీపీ 26, ఎంపీటీసీ 230, సూర్యాపేట జడ్పీటీసీ 23, ఎంపీపీ 23, ఎంపీటీసీ 235, వికారాబాద్ జడ్పీటీసీ 20, ఎంపీపీ 20, ఎంపీటీసీ 227, వనపర్తి జడ్పీటీసీ 15, ఎంపీపీ 15, ఎంపీటీసీ 133, వరంగల్ జడ్పీటీసీ 11, ఎంపీపీ 11, ఎంపీటీసీ 130, యాదాద్రి భువనగిరి జడ్పీటీసీ 17, ఎంపీపీ 17, ఎంపీటీసీ 178.ఇదిలా ఉంటే మరోవైపు క్షేత్రస్థాయిలో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. వార్డు నుంచి జడ్పీ ఛైర్మన్ వరకు రాబోయే రిజర్వేషన్ల వ్యవహారంపైనే చర్చలు జోరుగా జరుగుతున్నాయి. గ్రామాలు, మండలాల పరిధిలో రిజర్వేషన్లు ఎలా వస్తాయనే అంశంపై అన్ని పార్టీల నాయకులు ఆరా తీస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించనుండడంతోనే ఈ రీతిలో గ్రామీణ స్థాయిలో రాజకీయాలు వేడెక్కుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## బాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

అమరావతి,ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, టీ–జీ భరత్, గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరులు హాజరయ్యారు. ఐటీ–, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాల్లోని వివిధ పరిశ్రమలకు

# బీహార్‌లో పథకాల పంట పండిస్తున్న నితీష్ !

పాట్నా:బీహార్‌లో 125 యూనిట్ల విద్యుత్ వరకూ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని సీఎం నితీష్ కుమార్ ప్రకటించారు. అంతేనా..మరికొన్ని పథకాలను కూడా అమలు చేయబోతున్నారు. ఇదంతా రాబోతున్న ఎన్నికల కోసమే. నవంబర్‌లోపు అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. తీవ్రమైన అధికార వ్యతిరేకత ఉందని ప్రచారం జరుగుతున్న సమయంలో నితీష్ కుమార్ పదవిని నిలబెట్టుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా తాయిలాలు ప్రకటిస్తున్నారు.బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం రాజకీయ పార్టీలన్నీ పూర్తి స్థాయిలో రెడీ అయ్యాయి. ప్రస్తుతం అక్కడ జేడీయూ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంది. పేరుకు సీఎం నితీష్ కుమార్ అయినా ఆయన పార్టీ కంటే బీజేపీకే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ నితీష్ తన రాజకీయ చాణక్యంతో సీఎంగా కొనసాగుతున్నారు. అయితే ఆర్జేడీ..లేకపోతే బీజేపీ అన్నట్లుగా ఎవరు సీఎం పదవి ఇస్తారో వారితోనే జత కడుతున్నారు. ఇప్పుడు మరోసారి ఆయన అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నారు.లాలూ యాదవ్ కుమారుడు తేజస్వి యాదవ్ బీహార్ యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. నిలకడైన రాజకీయాలు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీతో సమన్వయం చేసుకుంటున్నారు. ముస్లింల మద్దతు ఉంటుంది. అందుకే ప్లాన్డ్ గా చేసుకుంటున్నారు. కానీ నితీష్‌కు.. ఈ విజయం చాలా అవసరం. బీజేపీ



కూటమి కంటే నితీష్‌కు విజయం అవసరం. రాను రాను ఆయన పార్టీ సైజ్ తగ్గిపోతోంది. ఈ సారి తేడా వస్తే.. ఆ ప్లేస్ మొత్తాన్ని బీజేపీ ఆక్రమించేస్తుంది. అందుకే.. పోటీపడి మరీ ప్రజలకు తాయిలాలు ప్రకటిస్తున్నారు. కానీ ఎన్నికలకు ముందు ఇచ్చే తాయిలాలు వల్ల లాభం కలిగిన ఉదాహరణలు భారత ప్రజాస్వామ్యంలో లేవు. మరి బీహార్‌లో ఏం జరుగుతుందో ?

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com